# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక

RNI - TELTEL/2023/87644

సంచిక : 332 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | సోమవారం | 23-03-2026 | పేజీలు-8 | వెల: రూ. 5.00


**నీలగిరి నిత్యపద్యం**

ఆటవెలది (కాకి పై పద్యం)
కాక కాక యనుచు కేకపెట్టి పిలుచు
చుట్టునున్నవారి చుట్టమోలె
కసిరికొట్టు జనులు కనికరమును లేక
వదరుబోతువనుచు వాయసమును

మీ
విజయప్రసాద్
కవి, తెలుగు బోధకులు


**విలేకరులు కావలెను**

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్): & చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా WHATS APP నంబర్:- 9705770909 సంప్రదించండి.


# మళ్ళీ మాదే అధికారం

## సిద్దిపేటలో కాంగ్రెస్‌ను గెలిపిస్తే మంత్రి పదవి



- రూ.3500 కోట్ల రైతు భరోసా విడుదల
- ఎగుమతులు చేసే స్థాయికి రైతులు ఎదగాలి
- వ్యవసాయమూ తెలుసు.. చీడపీడలకు ఏ మందు వేయాలో తెలుసు
- అన్ని నియోజకవర్గాల్లో సమానంగా అభివృద్ధి: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- నర్మెట్టలో ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ ప్రారంభం, రైతు ఉత్సవాల సభ
- వంట నూనె రిఫైనరీ ప్లాంట్ నిర్మాణానికి శంకుస్థాపన

మెదక్ ప్రాంతీయ మార్చి 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)
"రైతులు ఒకే విధంగా పంటలు వేయకుండా పంటల మార్పిడి చేసుకోవాలి.. దానివల్ల పంటలు పుష్కలంగా పండి ఎగుమతి చేసే స్థాయికి చేరుకుంటారు. వాణిజ్య పంటల సాగువైపు మళ్లాలి. రైతు భరోసా నిధులు విడుదల చేస్తున్నాం.. రాష్ట్రంలోని 73 లక్షల మంది రైతులకు ఈ పెట్టుబడి సాయం అందనుంది. రైతు పక్షపాతిగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుంది" అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. సిద్దిపేట జిల్లా నంగునూరు మండలంలో నర్మెట్ట గ్రామంలో రూ.300 కోట్లతో నిర్మించిన ఆయిల్‌పామ్ పరిశ్రమను ఆదివారం మంత్రులతో కలిసి ప్రారంభించారు.

-మిగతా 2 లో





## మోదీ సరికొత్త రికార్డు..

- ప్రభుత్వాధినేతగా 8,931 రోజులు పూర్తి
- పవన్ కుమార్ చామ్లింగ్ రికార్డు కనుమరుగు: భారత రాజకీయాల్లో నవశకం
- గుజరాత్ సీఎంగా మొదలై.. దేశ ప్రధానిగా హ్యాట్రిక్ వరకు..
- 2001 నుండి నేటి వరకు ప్రజాక్షేత్రంలో తిరుగులేని నేత
- నెహ్రూ రికార్డు సమం.. చామ్లింగ్ రికార్డు అధిగమనం: మోదీ 'పవర్' పాలిటిక్స్

న్యూఢిల్లీ
భారత ప్రధాని నరేంద్ర మోదీ సరికొత్త రికార్డు సృష్టించాడు. ప్రభుత్వాధినేతగా 8,391 రోజులు పూర్తి చేసుకుని రికార్డు సృష్టించాడు. అటు సీఎంగా, ఇటు ప్రధానిగా మోదీ ఈ ఘనత దక్కించుకున్నాడు. 24 ఏళ్లకు పైగా రాజ్యాంగ బద్ధమైన ప్రభుత్వాధినేతగా, అది కూడా మధ్యలో ఎలాంటి విరామం లేకుండా కొనసాగి మోదీ రికార్డు నెలకొల్పాడు. దీంతో ఇప్పటివరకు అత్యధిక (8,390) రోజులు పదవిలో కొనసాగిన సిక్కిం మాజీ సీఎం పవన్ కుమార్ ఛామ్లింగ్ రికార్డును మోదీ అధిగమించారు.ప్రధాని మోదీ తొలిసారిగా 2001లో గుజరాత్ సీఎంగా బాధ్యతలు చేపట్టారు. 2014లో ప్రధాని పదవి చేపట్టేవరకు ఆయన సీఎంగానే కొనసాగారు. ప్రధానిగా మోదీ ఇంకా కొనసాగుతూనే ఉన్నారు. ఇదే సమయంలో గుజరాత్ రాష్ట్రానికి ఎక్కువ కాలం సీఎంగా పని చేసిన ఘనత కూడా ఆయన సొంతం. అలాగే, ముఖ్యమంత్రుల నుంచి ప్రధాని పదవి చేపట్టి, ఎక్కువ కాలం కొనసాగింది కూడా మోదీయే. మోదీ ప్రధానిగా హ్యాట్రిక్ సాధించారు. 2014, 2019, 2024లో మోదీ తన పార్టీని, కూటమిని గెలిపించి

-మిగతా 2 లో

## తొలివిడత రైతుభరోసా రూ.3446.94 కోట్లు

- నేడు రైతు ఖాతాల్లో జమ
- మొదట విడతలో ఎకరా వరకు అందరికీ వర్తింపు
- 68.90 లక్షల మంది రైతులకు లబ్ధి
- ఏప్రిల్ రెండో వారంలో రెండో విడత రూ.2,650 కోట్లు

హైదరాబాద్ మార్చి 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)
రాష్ట్రంలోని రైతులకు పెట్టుబడి సాయం కింద రైతు భరోసా పథకంలో భాగంగా తొలి విడతలో రాష్ట్ర ప్రభుత్వం రూ.3,446.94 కోట్లను విడుదల చేసింది. ఆదివారం సెలవు దినం కావడంతో సోమవారం రైతుల ఖాతాల్లో ఆ డబ్బులు జమ కానున్నాయి. అయితే, తొలి విడతలో భూమి ఉన్న ప్రతి రైతుకూ ఒక ఎకరా వరకు(మొత్తం 57,44,907.19 ఎకరాలు) మాత్రమే ఇది వర్తించనున్నది. దీంతో 68,89,955 మంది రైతులకు లబ్ధిచేకూరనున్నది. ఏప్రిల్ రెండో వారంలో రూ.2,650 కోట్లు, మూడో విడతలో రూ.2,760 కోట్లను విడుదల చేయనున్నది. రెండో విడత పూర్తయ్యే సరికి 70 నుంచి 80 శాతం రైతులకు రైతు భరోసా పూర్తికానున్నది.

-మిగతా 2 లో



## ఇరాన్‌కు ట్రంప్ స్ట్రాంగ్ వార్నింగ్

- హర్మూజ్ జలసంధిని 48 గంటల్లో తెరవాలి..
- తెరవకపోతే,అతి పెద్దదైన విద్యుత్ ప్లాంట్లను పూర్తిగా ధ్వంసం చేస్తాం

న్యూఢిల్లీ
ఇరాన్‌పై మరోసారి అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. 48 గంటల్లోగా ఇరాన్ ఎటువంటి బెదిరింపు లేకుండా హర్మూజ్ జలసంధిని తెరవకపోతే, ఆ దేశంలోనే అతి పెద్దదైన విద్యుత్ ప్లాంట్లను పూర్తిగా ధ్వంసం చేస్తామని ట్రూత్ సోషల్ మీడియా వేదికగా మరోసారి పోస్ట్ చేశారు. కాగా, అంతకుముందు ట్రంప్ చేసిన ప్రకటన రాజకీయ విశ్లేషకులను ఆలోచనలో పడేసింది. ట్రూత్ సోషల్ వేదికగా డోనాల్ట్ ట్రంప్ కీలక ప్రకటన చేశారు. పశ్చిమాసియాలో చేపట్టిన మిలిటరీ ఆపరేషన్ ద్వారా తమ లక్ష్యాలకు చేరువైనట్లు ఆయన వెల్లడించారు. ఇరాన్‌పై చేపట్టిన సైనిక చర్య గురించి ట్రంప్ తన సోషల్ మీడియా అకౌంట్ ద్వారా తెలిపారు. ఇరాన్‌కు చెందిన క్షిపణి సామర్థ్యం, లాంచర్లు, ఇతర ఆయుధాలను పూర్తిగా ధ్వంసం చేసినట్లు చెప్పారు. ఇరాన్ ఇండస్ట్రియల్ బేస్‌ను కూడా ధ్వంసం చేసినట్లు తెలిపారు. ఆ దేశ నేవీ, ఎయిర్ ఫోర్స్‌ను కూడా దెబ్బతీశామన్నారు. యాంటీ ఎయిర్‌క్రాఫ్ట్ ఆయుధాలను కూడా ధ్వంసం చేశామన్నారు. ఇరాన్ అణ్వాయుధాలు తయారు చేసే సామర్థ్యాన్ని పూర్తిగా దెబ్బతీశామన్నారు. పశ్చిమాసియాలోని తమ మిత్ర దేశాలను రక్షించుకునేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తామన్నారు. ఇజ్రాయెల్, సౌదీ అరేబియా, ఖతార్, యూఏఈ, బహ్రెయిన్, కువైట్ ఇతర దేశాల రక్షణకు అధిక ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు చెప్పారు. కీలకమైన హోర్ముజ్

-మిగతా 2 లో

## ఎఫ్-15'పై ఇరాన్ దాడి

- హార్ముజ్ సమీపంలో కూల్చివేసినట్లు ప్రకటన
- ట్రంప్ '48 గంటల అల్టిమేటం' అనంతర పరిణామం



2 లో

## సీఎం రేవంత్ అధ్యక్షతన నేడు క్యాబినెట్

- ప్రభుత్వ ఉద్యోగుల జీతాల్లో 10శాతం తల్లిదండ్రులకు..
- 18 ఏండ్లలోపు పిల్లల డిజిటల్ మీడియాపై నియంత్రణ
- విద్వేష ప్రసంగాల నిరోధానికి చట్టం
- సాధ్యాసాధ్యాలపై చర్చించనున్న మంత్రివర్గం

హైదరాబాద్ మార్చి 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)
'దేశంలోను, రాష్ట్రంలోనూ కన్నతల్లిదండ్రులను పట్టించుకోని ఉదంతాలను చూస్తున్నాం.. అలా కన్నవారిని గాలికొదిలేస్తున్న ప్రభుత్వ ఉద్యోగుల పట్ల మా ప్రభుత్వం సీరియస్‌గా వ్యవహరించనుంది. వారి జీతాల్లోంచి ఎంతో కొంత తల్లిదండ్రుల ఖాతాల్లోకి జమయ్యే విధంగా విధానపరమైన నిర్ణయం తీసుకుంటాం...' ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పలు సందర్భాల్లో చెప్పిన మాటలివి. ఆయన చెప్పిన ఈ అంశాన్ని సోమవారం

-మిగతా 2 లో



# ఇందిరమ్మ ప్రభుత్వమంటే ఓ భరోసా

## మూడు ఎకానమిక్ జోన్లుగా రాష్ట్ర అభివృద్ధి

- ఇందిరమ్మ జీవిత బీమాతో 1.15 కోట్ల కుటుంబాలకు భరోసా
- ప్రజల జీవన స్థితిగతులను మెరుగుపరిచేలా బడ్జెట్
- రాష్ట్ర జీడీపీని పెంపొందించేలా బడ్జెట్ ప్రవేశపెట్టాం
- ఉపముఖ్యమంత్రి, ఆర్థికమంత్రి మల్లు భట్టివిక్రమార్క

ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి మార్చి 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)
ఇందిరమ్మ ప్రభుత్వమంటే ఓ భరోసా అని.. బడ్జెట్ సంఖ్యల చుట్టూ తిరిగే సంఖ్యలు కాదు.. ప్రజల చుట్టూ తిరిగే అంకెలు మాత్రమేనని, ప్రజల జీవనస్థితిగతులు మెరుగు పడటానికి ఉపయోగపడేది బడ్జెట్ అని ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి మల్లు భట్టివిక్రమార్క తెలిపారు. దేశంలోనే ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా అనేది అతిపెద్ద భరోసా అన్నారు.

-మిగతా 2 లో





## కేంద్రమంత్రులతో మోడీ కీలక భేటీ

- పశ్చిమాసియా ఉద్రిక్తతల నడుమ సమావేశం
- పెట్రోలియం, విద్యుత్, ఎరువులపై చర్చ
- సరఫరాలో అవాంతరాలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశం
- హాజరైన రాజ్‌నాథ్, అమిత్ షా, నడ్డా, పలువురు మంత్రులు

న్యూఢిల్లీ
పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్న తరుణంలో భారత్‌లో ఇంధన సంక్షోభం ఆందోళన కలిగిస్తున్నది. ఈ తరుణంలో ప్రధాని మోడీ.. పలువురు కేంద్ర మంత్రులతో కీలక సమావేశాన్ని నిర్వహించారు. దేశంలో పెట్రోలియం, విద్యుత్, ఎరువుల రంగాల స్థితిగతులపై వారితో చర్చించారు. ఈ సమావేశానికి కేంద్రమంత్రులు అమిత్ షా, రాజ్ నాథ్ సింగ్, జేపీ నడ్డా, శివరాజ్‌సింగ్ చౌహాన్, నిర్మలా సీతారామన్, జైశంకర్, రామ్మోహన్ నాయుడు, హర్దీప్ సింగ్ పురి, సర్బానంద సోనోవాల్, జాతీయ భద్రతా సలహాదారు (ఎన్ఎస్ఏ) అజిత్ దోవల్ హాజరయ్యారు. దేశవ్యాప్తంగా నిరంతర సరఫరా, సమర్థ పంపిణీపై మంత్రులతో ప్రధాని మోడీ చర్చించారు. గ్యాస్, పెట్రోల్ , ఎరువుల సరఫరాలో ఇబ్బందులు రాకుండా చూడాలన్న ప్రధాని.. సరఫరాలో అవాంతరాలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వినియోగదారులు, పరిశ్రమల ప్రయోజనాలను కాపాడటానికి కేంద్రం అంతర్జాతీయ పరిణామాలను నిరంతరం పరిశీలిస్తోందని

-మిగతా 2 లో

## కాంగ్రెస్‌లో కొనసాగే పరిస్థితి లేదు

- 25న పార్టీ సభ్యత్వానికి రాజీనామా :
- మాజీ మంత్రి జీవన్‌రెడ్డి



జగిత్యాల
కాంగ్రెస్ పార్టీలో తాను ఇకపై కొనసాగే పరిస్థితి లేదని సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి జీవన్‌రెడ్డి స్పష్టం చేశారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఇందిరా భవన్‌లో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ పార్టీలో కొనసాగే పరిస్థితులు లేవని, ఈ నెల 25న సభ్యత్వానికి రాజీనామా చేస్తానని ప్రకటించారు. 20నెలలుగా జగిత్యాలలో జరుగుతున్న పరిణామాలు తనను ఈ నిర్ణయానికి తీసుకొచ్చాయని, మానసిక క్షోభను అనుభవించానని తెలిపారు.

-మిగతా 2 లో

## లష్కర్-ఎ-తోయిబా కమాండర్ హత్య

హైదరాబాద్
లష్కర్-ఎ-తోయిబా ప్రధాన కార్యాలయం 'మార్కజ్ తాయిబా'లో శనివారం సీనియర్ కమాండర్ బిలాల్ అరిఫ్ సలాఫీ అత్యంత దారుణ హత్యకు గురయ్యాడు. ఈద్ ప్రార్థనల అనంతరం బయటకు వస్తున్న సమయంలో గుర్తు తెలియని దుండగులు అతన్ని సమీపం నుండి తుపాకీతో

-మిగతా 2 లో



# మోదీ సరికొత్త రికార్డు..

మొదటి తరువాయి



అధికారం చేపట్టారు. ఇంతకుముందు మూడుసార్లు లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించిన జవహర్ లాల్ నెహ్రూ రికార్డును సమం చేశారు. వరుసగా దేశంలో అత్యధిక రోజులు పదవిలో కొనసాగిన రెండో ప్రధానిగా కూడా మోదీ నిలిచారు. ఈ విషయంలో ఇందిరాగాంధీ రికార్డును మోదీ దాటారు. అలాగే ఒక పార్టీ పక్ష నేతగా వరుసగా ఆరుసార్లు ఎన్నికైన ఘనత కూడా ఆయనదే. మోదీ అత్యధిక రోజులు దేశంలో ప్రభుత్వాధినేతగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ఆయనకు రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ శుభాకాంక్షలు తెలిపారు.ం

## ఇరాన్‌కు ట్రంప్ స్ట్రాంగ్ వార్నింగ్

మొదటి తరువాయి

జలసంధికి రక్షణ ఏర్పాటు చేయాలని, ఆ జలసంధిని వినియోగించే దేశాలు దానికి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఒకవేళ ఎవరికైనా ఈ అంశంలో సహాయం అవసరమైతే తాము ఆ దేశాలను ఆదుకోనున్నట్లుచెప్పారు. తాము చేపట్టిన మిలిటరీ ఆపరేషన్ పట్ల శ్రద్ధ చూపిన వారికి థ్యాంక్స్ చెబుతున్నట్లు ట్రంప్ పేర్కొన్నారు. ఇజ్రాయెల్‌తో కలిసి ఇరాన్‌పై దాడి చేసిన అమెరికా తన మిలిటరీ ఆపరేషన్‌ను నిలిపివేయాలనుకుంటునున్నట్లు చెప్పిన విషయం తెలిసిందే. ఇప్పుడు ఇలా తీవ్ర వాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది.

## తొలివిడత రైతుభరోసా రూ.3446.94 కోట్లు

మొదటి తరువాయి

అత్యధికంగా నల్లగొండ జిల్లాలోని 5,22,313 మంది రైతులకు 268.57 కోట్ల రూపాయల లబ్ది చేకూరనున్నది. అత్యల్పంగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో 24,935 మంది రైతులకు 10.43 కోట్లు విడుదల కానున్నాయి.

## ఎఫ్-15'పై ఇరాన్ దాడి

-హార్ముజ్ సమీపంలో కూల్చివేసినట్లు ప్రకటన

-ట్రంప్ '48 గంటల అల్టిమేటం' అనంతర పరిణామం

**టెహ్రాన్**

పశ్చిమాసియాలో పెరుగుతున్న యుద్ధ ఉద్రిక్తతల నడుమ అమెరికా, ఇరాన్‌లు సవాళ్లు, ప్రతిసవాళ్లు విసురుకుంటున్నాయి. హార్ముజ్‌ను 48 గంటల్లో తెరవాలనీ, లేదంటే తీవ్ర పరిణామాలుంటాయని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రకటించిన విషయం విదితమే. అయితే తమ నుంచి కూడా ప్రతిఘటన తప్పదని ఇరాన్ సైతం బదులిచ్చింది. దీంతో మధ్యప్రాచ్యంలో పరిస్థితులు ఉద్రిక్తంగా మారుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలో ఇరాన్ కీలక ప్రకటన చేసింది. శుత్ర దేశానికి చెందిన ఎఫ్-15ను లక్ష్యంగా చేసుకొని క్షిపణులతో దాడి చేసినట్టు పేర్కొంది. దక్షిణ తీర ప్రాంతం హార్ముజ్ ద్వీపం సమీపంలో ఇరాన్ మీదుగా ఎగురుతున్న 'శత్రువు' ఎఫ్-15 యుద్ధ విమానాన్ని అడ్డగించి, తమ క్షిపణులతో కూల్చివేసినట్టు వివరించింది. ఈ మేరకు ఇరాన్ వైమానిక రక్షణ ప్రధాన కార్యాలయం ఆదివారం తెలిపింది.

## కాంగ్రెస్‌లో కొనసాగే పరిస్థితి లేదు

మొదటి తరువాయి

నాలుగు దశాబ్దాల అనుబంధాన్ని తెంచుకోవడం బాధాకరమని, అయినప్పటికీ తన సమస్యకు పరిష్కారం లభించకపోవడంతో పార్టీ వీడాల్సిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు. శాసన మండలిలో ఒంటరి పోరాటం చేశానని, ప్రస్తుతం అధికారంలో ఉన్నప్పటికీ ప్రజల పక్షాన నిలబడి పోరాడినట్టు గుర్తు చేశారు. పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలు కాంగ్రెస్ అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడం వల్ల పరిస్థితులు క్లిష్టంగా మారాయని తెలిపారు. పార్టీ కార్యకర్తల హక్కులను కాలరాస్తున్నారని, గౌరవం లేని చోట కొనసాగడం సాధ్యం కాదని తేల్చి చెప్పారు. ఈ నెల 25న బండారి గార్డెన్‌లో అభిమానులు, శ్రేయోభిలాషులతో సమావేశమై భవిష్యత్ కార్యాచరణపై నిర్ణయం తీసుకుంటానని తెలిపారు. తనకు జరిగిన అన్యాయంలో ఎమ్మెల్యే పాత్ర కూడా ఉందని ఆరోపించారు. ప్రాణహిత నదిపై తుమ్మిడిహెట్టి బ్యారేజ్ నిర్మాణంలో జాప్యం వల్ల ఉత్తర తెలంగాణకు కరువు ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో పేర్కొన్న ఈ ప్రాజెక్టును విస్మరించడం సరికాదన్నారు. ప్రజాస్వామ్యంలో తన స్వేచ్ఛకు అనుగుణంగా నిర్ణయం తీసుకుంటున్నానని, ఈ నెల 25న కాంగ్రెస్ పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్టు జీవన్‌రెడ్డి స్పష్టం చేశారు. జగిత్యాలతో తన అనుబంధం ఎప్పటికీ కొనసాగుతుందని తెలిపారు.

## లష్కర్-ఎ-తోయిబా కమాండర్ హత్య

మొదటి తరువాయి



కాల్చి, కత్తులతో నరికి చంపారు. 2005 నుండి సంస్థలో కీలక పాత్ర పోషిస్తూ, నిధుల సమీకరణ, రిక్రూట్‌మెంట్లలో ఆరితేరిన సలాఫీని ఆసుపత్రిలో చేర్పించినా, చికిత్స పొందుతూ మరణించినట్లు నివేదికలు తెలిపాయి.

# మళ్లీ మాదే అధికారం

మొదటి తరువాయి



అక్కడే నిర్మించతలపెట్టిన వంటనూనె రిఫైనరీ ప్లాంట్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం రైతు ఉత్సవాల బహిరంగ సభలో రైతు భరోసా నిధులను సీఎం విడుదల చేశారు. ఇవాళ బ్యాంకులకు సెలవు దినం కావడంతో రైతుల ఖాతాల్లో రేపు డబ్బులు జమ కానున్నాయి. తొలి విడతగా ఎకరంలోపు ఉన్న రైతులకు రూ.3,600కోట్లు ఖాతాల్లో జమకానున్నాయని, ఆ తర్వాత రెండో విడతలో రూ.2,650 కోట్లు, చివరి విడత గా రూ.2,760 కోట్లు విడుదల చేయను న్నామని తెలిపారు. మొత్తం 45 రోజుల్లో రైతు భరోసా కింద 9వేల కోట్ల రూపాయలను 70 లక్షల మంది రైతుల ఖాతాల్లో వేస్తామన్నారు.రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధరతోపాటు రూ.500 బోనస్ ఇస్తున్నామని తెలిపారు. గతంలో కేసీఆర్ హయాంలో రైతుల కోసం ప్రతినెలా రూ.2533 కోట్లు ఖర్చు చేస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం 28 నెలల్లో ప్రతి నెలా రూ.5500 కోట్లు రైతు సంక్షేమం కోసం ఖర్చు చేస్తోందని చెప్పారు. తుఫాన్‌కి కామారెడ్డి ప్రాంతాల్లోని పొలాల్లో ఇసుక మేటలు వేశాయని, పంట నష్టం జరిగితే ఎకరానికి రూ.10 వేల పరిహారం ఇచ్చామని అన్నారు. ఈ 28 నెలల్లో రైతుల కోసం లక్షా 40 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేశామని చెప్పారు.

**రైతులు వాణిజ్య పంటల వైపు వెళ్లాలి..**

ఒకప్పుడు క్వింటాల్ పసుపు అమ్మితే తులం బంగారం వచ్చేది, కానీ ఇప్పుడు పరిస్థితులు మారాయని సీఎం అన్నారు. 10 లక్షల ఎకరాల్లో పామాయిల్ సాగు చేయాలని సూచించారు. రైతులు వాణిజ్య పంటల వైపు మొగ్గు చూపాలని, రంగారెడ్డి జిల్లా చుట్టూ ఒకప్పుడు పాడి పరిశ్రమ, పండ్ల తోటలు ఉండేవని, ఇప్పుడు రియల్ ఎస్టేట్‌తో అవన్నీ కనుమరుగయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. పంట మార్పిడి కోసం రైతులు పూనుకోవాలని, మిల్లెట్స్, ఆకు కూరలు లాంటి పంటలు పండించాలని సూచించారు.

**ప్రయివేటు మోజు వద్దు**

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పెద్ద రైతు.. వ్యవసాయం గురించి ఆయనకు తెలిసినంతగా ఎవరికీ తెలియకపోవచ్చని, ఆయన వ్యవసాయశాఖ మంత్రిగా ఉండటం మన అదృష్టమని ముఖ్యమంత్రి అన్నారు. పంట మార్పిడి కోసం కృషి చేయాలని బీజేపీ ఎంపీలు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డితో కలిసి ప్రధానిని కలుస్తామన్నారు. మహిళల కోసం సోదరుడిగా నిలబడుతానని భరోసా ఇచ్చారు. రాష్ట్రంలో అత్యుత్తమ శిక్షణ పొందిన టీచర్లు లక్ష మందికిపైగా పనిచేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలను ప్రక్షాళన చేసే బాధ్యత తీసుకున్నామని, వచ్చే విద్యాసంవత్సరం నుంచి తెలంగాణ పబ్లిక్ స్కూల్స్‌ను ప్రారంభిస్తున్నామని చెప్పారు. నర్సరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు ప్రారంభించడమే కాకుండా విద్యార్థులకు ఉదయం బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని ప్రారంభిస్తున్నామన్నారు. ప్రయివేట్ మోజులో పడొద్దు.. పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. ఇంజినీరింగ్ పూర్తి చేస్తే ఉద్యోగం వస్తుందన్న గ్యారెంటీ లేదు కానీ ఏటీసీ (అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు)లో చదువుకుంటే ఉద్యోగం కల్పించే బాధ్యత తనది అని చెప్పారు. వచ్చే విద్యాసంవత్సరం నుంచి ఏటీసీల్లో చదివే విద్యార్థులకు ప్రతినెలా రూ.2వేల చొప్పున స్కాలర్‌షిప్ ఇస్తామని తెలిపారు.

**సిద్దిపేటలో అవకాశం ఇవ్వాలి**

2029లోనూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీనే అధికారంలోకి రాబోతుందని సీఎం ధీమా వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో సిద్దిపేటలో కాంగ్రెస్ గెలవాలని, ఇక్కడ గెలిచిన ఎమ్మెల్యేను మంత్రిని చేస్తామని హామీ ఇచ్చారు. సిద్దిపేటను 1984 నుంచి ఒకే కుటుంబం పాలిస్తోందని ఒక్కసారి ఇతరులకు కూడా అవకాశం ఇవ్వాలని కోరారు. ప్రాజెక్టుల విషయంలో బీఆర్‌ఎస్‌లా తాము వ్యవహరించడం లేదని, నారాయణపేట కొడంగల్ ప్రాజెక్టు నిర్వాసితులను ఒప్పించాకే పనులు ప్రారంభించామని తెలిపారు. "మూసీలో మీ మొసలి కన్నీరు ప్రజలు అర్థం చేసుకోవడం లేదనుకుంటున్నారా? అభివృద్ధి జరగకుండా అడ్డం పడుకుంటామంటే ఊరుకుంటామా? ముఖ్యమంత్రినై సిద్దిపేటకు రాలేదా? 2029లో మళ్లీ గెలిచి సిద్దిపేటకు వస్తామ"ని సీఎం విశ్వాసం వ్యక్తం చేశారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావుతో రాజకీయంగా తనకు భిన్నాభిప్రాయాలు ఉన్నాయన్నారు. కానీ వారి నియోజకవర్గాల్లోనూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తూ తమ నిజాయితీ నిరూపించుకుంటున్నామని చెప్పారు. నర్మెట్ట ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ పనులు తాను ముఖ్యమంత్రి అయ్యాకే ప్రారంభమయ్యాయని చెప్పారు. నిధుల విషయంలో తానేమీ వివక్ష చూపడం లేదని స్పష్టం చేశారు.

# సీఎం రేవంత్ అధ్యక్షతన నేడు క్యాబినెట్

మొదటి తరువాయి

నిర్వహించబోయే రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో చర్చించనున్నారు. హైదరాబాద్‌లోని సచివాలయంలో సాయంత్రం 5 గంటలకు క్యాబినెట్ భేటీ కానుంది. ఈ సందర్భంగా ప్రభుత్వ ఉద్యోగుల జీతాల్లోంచి కనీసం 10 నుంచి 15 శాతం వరకు తల్లిదండ్రుల ఖాతాల్లో జమయ్యేలా విధానపరమైన నిర్ణయం తీసుకుంటే ఎలా ఉంటుందనే అంశంపై చర్చించనున్నారు. దీనికి మంత్రివర్గం ఆమోదముద్ర వేస్తే... ఆ వెంటనే అసెంబ్లీలో బిల్లును ప్రవేశపెట్టనున్నారని సమాచారం. దీంతోపాటు 18 ఏండ్లలోపు పిల్లలను డిజిటల్ మీడియా నుంచి రక్షించేందుకు వీలుగా 'డిజిటల్ మీడియా నిరోధక, నియంత్రణ చట్టాన్ని' తీసుకురావాలనే అంశంపై క్యాబినెట్ చర్చించనుంది. ఇందుకు సంబంధించి వివిధ రాష్ట్రాలు అనుసరిస్తున్న పద్ధతులు, సాంకేతికాంశాలను పరిశీలించి విధి విధానాలు ఖరారు చేయటంపై మంత్రివర్గంలో చర్చించనున్నారు. రాష్ట్రంలో 'మత విద్వేష ప్రసంగాల నియంత్రణ'కు ఎలాంటి చర్యలు తీసుకోవాలనే దానిపై కూడా క్యాబినెట్ సమాలోచనలు చేయనుంది. దీనిపై కర్నాటక ప్రభుత్వం ఇప్పటికే కొంత కసరత్తులు చేసింది. వాటిపై అధ్యయనం చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. వీటితోపాటు గత అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వం ప్రవేశపెట్టిన గిగ్ వర్కర్ల బిల్లు, క్యూర్.. ఫ్యూర్..రేర్‌లకు సంబంధించిన బిల్లుల సవరణపై క్యాబినెట్‌లో చర్చించి, ఆమోదముద్ర వేయనున్నారు. వీటన్నింటిలో ఏయే అంశాలకు మంత్రివర్గం పచ్చజెండా ఊపితే.. ఆయా అంశాలపై అసెంబ్లీలో బిల్లులను ప్రవేశపెడతారని ఉన్నతాధికారులు తెలిపారు. ప్రస్తుత బడ్జెట్ సమావేశాల్లో సమయాన్నిబట్టి వాటికి ఆమోదముద్ర వేస్తారు. టైం సరిపోకపోతే వచ్చే వర్షాకాల సమావేశాల్లో వాటిని ఓకే చేస్తారని సమాచారం.

# ఇందిరమ్మ ప్రభుత్వమంటే ఓ భరోసా

మొదటి తరువాయి



రాష్ట్రంలోని 1.15 కోట్ల కుటుంబాలకు ఈ జీవిత బీమా వర్తింపజేస్తున్నట్టు తెలిపారు. ఇటువంటి స్కీం దేశంలోనే ఎక్కడా లేదన్నారు. విద్యా, వైద్య, గృహనిర్మాణం, వ్యవసాయం, పౌష్టికాహారం, పరిశ్రమలు, స్కిల్ డెవలప్‌మెంట్, ఉద్యోగాల కల్పన.. ఇలా అన్నింటినీ దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర జీడీపీని పెంపొందించే దిశగా బడ్జెట్‌ను ప్రవేశపెట్టామన్నారు. ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బడ్జెట్ ఆవశ్యకతను వివరిస్తూ భట్టి మాట్లాడారు.

**కొత్తగా మూడు స్కీంలు..**

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లలందరికీ పౌష్టికాహారం అందించాలనే లక్ష్యంతో అల్పాహారంతోపాటు వారంలో మూడ్రోజులు పాలు, మరో మూడ్రోజులు రాగి జావ ఇవ్వాలని నిర్ణయించామని భట్టి తెలిపారు. ఇంటర్మీడియెట్ విద్యార్థులకూ మధ్యాహ్న భోజనం పెట్టాలని నిర్ణయించామన్నారు. మానవ వనరులను వృద్ధి చేసుకోవాలనే లక్ష్యంతో ఈ మూడు పథకాలను ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. ఇందిరమ్మ ఇండ్ల బిల్లుల గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఈ ఏడాది కూడా నియోజకవర్గానికి వెయ్యి ఇండ్ల చొప్పున ఇవ్వాలని నిర్ణయించామన్నారు. ప్రతి నియోజకవర్గానికీ ఓ మోడల్ స్కూల్ చొప్పున మంజూరు చేశామన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు క్యాష్ లెస్ హెల్త్‌కార్డును ప్రవేశపెట్టిన ఘనత కూడా తమ ప్రభుత్వానిదే అన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు రూ.1.2 కోట్ల ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించామన్నారు. జీడీపీని పెంపొందించే అనేక రంగాలకూ బడ్జెట్‌లో రాయితీలు ఇచ్చామన్నారు. 68.89 లక్షల పట్టాదారులకు ఎకరానికి రూ.6వేల చొప్పున 3,460.94 కోట్లు రైతుభరోసా కింద రైతుల అకౌంట్లో జమ చేస్తామన్నారు. 45 రోజుల్లో మూడు విడతలుగా రైతుభరోసా రైతులందరి అకౌంట్లలో జమ అవుతాయని తెలిపారు. ప్రపంచీకరణ నేపథ్యంలో స్కిల్డ్ యూనివర్శిటీలు ఏర్పాటు చేస్తున్నామని ప్రకటించారు. ప్రతి నియోజకవర్గానికీ ఓ అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్ చొప్పున మంజూరు చేశామన్నారు.

# కేంద్రమంత్రులతో మోడీ కీలక భేటీ

మొదటి తరువాయి

ఇప్పటికే ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ప్రపంచ ఇంధన రవాణాలో కీలకమైన హార్ముజ్ జలసంధిని ఇరాన్ తన ఆధీనంలో ఉంచుకుంది. యుద్ధం మొదలైనప్పటి నుంచి ఇరాన్ చాలా తక్కువ నౌకలను మాత్రమే దీని గుండా అనుమతిస్తోంది. ఈ దిగ్బంధం వల్ల భారత్ సహా అనేక దేశాలకు ఇంధన సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈ నేపథ్యంలో ప్రధాని మోడీ ఇప్పటికే సౌదీ అరేబియా, యూఏఈ, ఖతార్, బహ్రెయిన్, కువైట్, జోర్డాన్, ఫ్రాన్స్, మలేషియా, ఇజ్రాయెల్, ఇరాన్ నాయకులతో ఫోన్ ద్వారా చర్చలు జరిపారు. గ్యాస్ పంపిణీని క్రమబద్ధీకరించడానికి, సరఫరా ఒత్తిళ్లను తగ్గించడానికి ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోంది. ఇందులో భాగంగా సిటీ గ్యాస్ ప్రాజెక్టుల ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశిస్తూనే, కీలక రంగాలకు వాణిజ్య ఎల్పీజీ కేటాయింపులను పెంచింది.



# నీటి సంరక్షణ అందరి బాధ్యత



**కరీంనగర్, మార్చి 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
వేసవి కాలంలో భూగర్భ జలాలు అడుగంటి పోతాయని, జల సంరక్షణతోనే నీటి ఎద్దడి సమస్యను శాశ్వతంగా నివారించవచ్చని నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ అన్నారు. ఆదివారం ఉదయం స్థానిక వైశ్య భవన్‌లో మానేరు పర్యావరణ సమితి నిర్వహించిన ప్రపంచ జల దినోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై సుజలాం సుఫలాం గోడ ప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో వాననీరు వృథాగా పోతుందని, ప్రతి ఇంటిలో, వ్యవసాయ భూముల్లో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. మానేరు పర్యావరణ సమితి అధ్యక్షుడు తోట లక్ష్మణరావు మాట్లాడుతూ ఎండిపోయిన బోర్లు, గుట్టల చుట్టూ, బీడు భూముల వద్ద కాంటూరు కంధకాలు త్రవ్వడం, వాగులపై వాటర్‌షెడ్ ప్రాజెక్టులు నిర్మించడం ద్వారా భూగర్భ జలాలు పెరిగి నీటి కొరత తగ్గుతుందని వివరించారు. సర్వోదయ అధ్యక్షుడు పెద్ది లక్ష్మీనారాయణ మాట్లాడుతూ కలుషిత నీరు త్రాగడం వల్ల ప్రజలు రోగాల బారిన పడుతున్నారని, చిన్న పిల్లలు ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జల వనరులను కలుషితం కాకుండా కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గంజి స్వరాజ్యబాబు, వంగల పవన్, కన్న కృష్ణ, చిదుర సురేష్, నలుమాచు సుదర్శన్, యాదవ రాజు, పబ్బ అరుణ తదితరులు ప్రసంగించారు. ప్రధాన కార్యదర్శి సామ నారాయణ వందన సమర్పణ చేశారు. కొమురవెల్లి వెంకటేశం, కట్కూరి సుధాకర్, పెద్ది విద్యాసాగర్, నలుమాచు చంద్రశేఖర్, తోడుపునూరి దశరథం, కైలాస నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా గాయత్రి విద్యానికేతన్‌లో యూకేజీ కాన్వకేషన్ వేడుక



**పెద్దపల్లి, మార్చి 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
పెద్దపల్లి పట్టణంలోని గాయత్రి విద్యానికేతన్‌లో యూకేజీ చిన్నారులు పూర్వ ప్రాథమిక విద్యను విజయవంతంగా పూర్తిచేసుకుని ప్రాథమిక విద్యలోకి అడుగుపెడుతున్న సందర్భంగా కాన్వకేషన్ వేడుకను ఘనంగా నిర్వహించారు. చిన్నారుల జీవితంలో చిరస్మరణీయంగా నిలిచేలా ఈ కార్యక్రమాన్ని ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గాయత్రి విద్యాసంస్థల చైర్మన్ శ్రీనివాస్ మాట్లాడుతూ, పూర్వ ప్రాథమిక విద్య విద్యార్థి జీవితానికి బలమైన పునాది అని పేర్కొన్నారు. ఆడుతూ పాడుతూ నేర్చుకునే ఈ దశలో పిల్లలు తమ ఆశయాలను సాధించేందుకు కృషి చేయాలని ప్రేరేపించారు. యూకేజీ పూర్తి చేసి మొదటి తరగతిలో అడుగుపెడుతున్న ఈ సందర్భాన్ని మధురమైన జ్ఞాపకంగా మార్చడం మా లక్ష్యమని అన్నారు. కార్యక్రమం ఆనందభరితంగా సాగింది. చిన్నారులు పాటలు పాడి, నృత్యాలు చేసి, అమాయకమైన ఉపన్యాసాలతో అందరినీ ఆకట్టుకున్నారు. తల్లిదండ్రులు, గురువులు, స్నేహితుల పట్ల కృతజ్ఞతాభావాన్ని వ్యక్తం చేసిన వారి ప్రదర్శనలు హాజరైన వారిని మంత్రముగ్ధులను చేశాయి. ఈ వేడుకలో విద్యార్థుల తల్లిదండ్రులు, యూకేజీ ఉపాధ్యాయులు, కరస్పాండెంట్ రజనీ దేవి, ప్రిన్సిపల్ విజయ్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు. అందరి సమక్షంలో వేడుక విజయవంతంగా ముగిసింది.

## కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి సైనికుడి వలే కృషి చేస్తాం

### - సూర సమ్మయ్య



**పాలకుర్తి, మార్చి 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఇటీవల పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ కమిటీలో పాలకుర్తి మండలానికి చెందిన సీనియర్ నేతలకు కీలక పదవులు లభించడం పట్ల స్థానిక నాయకులు, కార్యకర్తలు ఆనందం వ్యక్తం చేశారు. బసంతనగర్ గ్రామ సర్పంచ్ పార్శవేణి శ్రీనివాస్, అల్ట్రాటెక్ సిమెంట్ కంపెనీ కాంట్రాక్టు కార్మిక సంఘం మాజీ అధ్యక్షుడు సూర సమ్మయ్య జిల్లా ప్రధాన కార్యదర్శులుగా, పాలకుర్తి గ్రామానికి చెందిన వాసుదేవరావు జిల్లా సెక్రటరీగా, రామావుపల్లి గ్రామానికి చెందిన డా. మంచినీళ్ళ బాబునాథ్ (భాస్కర్) కార్యవర్గ సభ్యుడిగా ఎన్నిక కావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఎన్నో ఏళ్లుగా పార్టీ కోసం కష్టపడి పనిచేసిన తమకు అధిష్టానం కీలక పదవులు అప్పగించడం వల్ల మరింత బాధ్యత పెరిగిందని, రామగుండం నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి సైనికుడి వలే కృషి చేస్తామని వారు తెలిపారు. ఈ సందర్భంగా రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కన్ సింగ్, ఆయన సతీమణి మనాలి ఠాకూర్, మార్కెట్ కమిటీ చైర్మన్ గాలిపల్లి తిరుపతి, మండల అధ్యక్షుడు ముక్కెర శ్రీనివాస్ గౌడ్, కాంగ్రెస్ కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.

## నర్మెట్ట రైతు అవగాహన సదస్సుకు తరలిన ఎలిగేడు రైతులు



**ఎలిగేడు, మార్చి 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ప్రజాపాలన రైతు ఉత్సవాల్లో భాగంగా సిద్ధిపేట జిల్లా నర్మెట్టలో ఆదివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రూ.300 కోట్ల వ్యయంతో నిర్మించిన అత్యాధునిక ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీని ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులకు అవగాహన కల్పించే సదస్సు కూడా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎలిగేడు మండలంలోని ఎలిగేడు, ధూళికట్ట, సుల్తానాపూర్ గ్రామాల నుంచి మూడు బస్సుల్లో ప్రజాప్రతినిధులు, రైతులు తరలివెళ్లారు. ఈ సదస్సులో ఏవో ఉమాపతి, ఈఏవోలు శరణ్య, సురేష్, గణేశ్, సర్పంచులు కప్పల ప్రవీణ్, సిద్ది తిరుపతి, మాజీ సర్పంచ్ మండిగ రాజనర్సయ్య, మాజీ ఉపసర్పంచ్ కోరుకంటి వెంకటేశ్వర్‌రావు, కవ్వంపల్లి స్వామి, ముంజం, ముత్యాలు, బాసంపల్లి వినోద్, సుమన్, చంద్రారెడ్డి, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ ఇసుక రవాణాపై కఠిన చర్యలు




**కరీంనగర్ , మార్చి 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
: సుల్తానాబాద్ మండలం నారాయణరావుపల్లె గ్రామానికి చెందిన బర్రె సతీష్ తన యజమాని చిగురి సుధాకర్ ఆదేశాల మేరకు ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను రవాణా చేస్తుండగా, కరీంనగర్ రూరల్ పోలీసులు మొగ్దుంపూర్ వద్ద పట్టుకున్నారు. పోలీసులు గ్రామాల్లో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో ఈ అక్రమ రవాణా బయటపడింది. ట్రాక్టర్‌ను సీజ్ చేసి, నిందితులపై కేసు నమోదు చేసి కోర్టుకు పంపించారు. అక్రమ ఇసుక రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని కరీంనగర్ రూరల్ సీఐ ఏ. నిరంజన్ రెడ్డి హెచ్చరించారు.

## నేటి ఉచిత మెగా వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి



**ఎలిగేడు, మార్చి 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఎలిగేడు మండలంలోని లాలపల్లె గ్రామపంచాయతీ కార్యాలయంలో సోమవారం సాయంత్రం 5 గంటల నుండి 7 గంటల వరకు ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు గ్రామ సర్పంచ్ ఏలేటి వెంకటరెడ్డి తెలిపారు. కరీంనగర్ మెడికవర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ శిబిరంలో జనరల్ ఫిజీషియన్, డయాబెటాలజిస్ట్, జనరల్ సర్జన్, ఆర్థోపెడిక్ సర్జన్ వంటి వైద్య నిపుణులు సేవలు అందించనున్నారు. గ్రామ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సర్పంచ్ ఏలేటి వెంకటరెడ్డి కోరారు.

## హెల్పింగ్ హాండ్స్ ఆధ్వర్యంలో చిన్నారికి సహాయం



**దేవరకొండ మార్చి 22. (నీలగిరి ఎక్స్ ప్రెస్).**
దేవరకొండ పట్టణం జంగాలకాలనీ కి చెందిన ప్రవీణ్ కుమార్ కూతురు దువ్వ భావన 5 సంవత్సరాలు అనే చిన్నారి కి గత 15 రోజుల క్రితం ఆపేండెక్స్ ఆపరేషన్ చేయడం జరిగింది. కడుపులో మొత్తం ఇన్ఫెక్షన్ అవ్వడం తో పేగు బైటికి పెట్టడం జరిగింది. చిన్నారికి ఖర్చుతో కూడుకున్న వైద్యం కావడంతో పాప తండ్రి ప్రవీణ్ కుమార్ మన హెల్పింగ్ హాండ్స్ అసోసియేషన్ సహాయం కోరడం జరిగింది. హెల్పింగ్ హాండ్స్ వారు ఆదివారం ఇంటికి వెళ్లి పాపను చూసి 10,000/-రూపాయలు సహాయం అందించారు.

## జలమే మానవ జీవనానికి ఆధారం



**హుస్నాబాద్, మార్చి 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా హుస్నాబాద్ పట్టణంలోని కస్తూర్బా గాంధీ విద్యాలయంలో మేరా యువభారత్ సిద్దిపేట మరియు సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మి విద్యార్థులతో నీటి పొదుపుపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నీరు మానవ జీవనానికి ప్రాథమిక ఆధారం అని, భావితరాలకు అందించాలంటే మనం నీటిని సంరక్షించుకోవాలని పేర్కొన్నారు. ఇళ్లలో ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకోవాలని, నీటిని వృథా చేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని విద్యార్థులను కోరారు. సామాజిక, ఆర్థిక వృద్ధి ఎక్కువగా నీటిపైనే ఆధారపడి ఉంటుందని, త్రాగునీరు మానవ ఆరోగ్యానికి అత్యంత అవసరమని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మిషన్ భగీరథ, జలశక్తి అభయాన్ వంటి పథకాల ద్వారా నీటి సంరక్షణకు ప్రజల భాగస్వామ్యాన్ని ప్రోత్సహిస్తున్నాయని ఆమె వివరించారు. పరిశుభ్రమైన నీరు లేకపోవడం వల్ల వ్యాధులు వస్తాయని, అందుకే నీటిని పొదుపుగా వాడాలని సూచించారు. సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు వలస సుభాష్ మాట్లాడుతూ నీరు అత్యంత విలువైన వనరులలో ఒకటని, బాధ్యతతో వినియోగించుకోవాలని విద్యార్థులను ప్రేరేపించారు. నీటి నాణ్యతను మెరుగుపరచడం, కాలుష్యాన్ని తగ్గించడం, పరిశ్రమల వ్యర్థాల నియంత్రణ, నదులు, జలాశయాలు, అడవులు, పర్వతాలు వంటి నీటి పర్యావరణ వ్యవస్థలను రక్షించాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతు ఉత్సవాలు



**పాలకుర్తి, మార్చి 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఆదివారం పాలకుర్తి రైతు వేదికలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతు ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నదాతలకు రైతు భరోసా నిధులు విడుదలతో పాటు నర్మెట్ట ఆయిల్ ఫాం ఫ్యాక్టరీ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించారు. పాలకుర్తి రైతు వేదికలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి బండి ప్రమోద్ కుమార్, పాలకుర్తి సర్పంచ్ పెద్దపల్లి తిరుమల ఆజిమల్లు, వార్డు సభ్యులు దుర్గం ఉష, పెద్దపల్లి సంధ్యతో పాటు రైతులు పాల్గొన్నారు.

# విప్లవ వీరుల త్యాగం నిత్య చైతన్య స్ఫూర్తిగా నిలుస్తుంది

**- మాదం తిరుపతి**



**కరీంనగర్, మార్చి 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
దేశ స్వాతంత్ర్య పోరాటంలో తమ ప్రాణాలను అర్పించిన విప్లవ వీరులు భగత్ సింగ్, రాజగురు, సుఖదేవ్‌ల త్యాగం నిత్య చైతన్య స్ఫూర్తిగా నిలుస్తుందని యుఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి మాదం తిరుపతి పేర్కొన్నారు. భగత్ సింగ్, ఆయన సహచరులు సామ్రాజ్యవాదానికి, కులతత్వానికి, మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడి యువతకు మార్గదర్శకులయ్యారని ఆయన అన్నారు. మతం వ్యక్తిగత అంశం, అది రాజకీయాల్లోకి చొరబడితే మతోన్మాదం అవుతుంది. అప్పుడు అది ఒక పెద్ద శత్రువుగా ఎదుర్కోవాలి అని భగత్ సింగ్ చెప్పిన మాటలను గుర్తుచేశారు. లాలా లజపతిరాయ్ మతతత్వ రాజకీయాలకు దగ్గరైనప్పుడు కూడా భగత్ సింగ్ ఆయనను తీవ్రంగా విమర్శించారని, ఆయన రాసిన నేను ఎందుకు నాస్తికుడను అనే రచనలో మతం, దేవుడు పట్ల తన వైఖరిని స్పష్టంగా తెలియజేశారని వివరించారు. నేటి కాలంలో మతోన్మాదం, కులతత్వం, ఉగ్రవాద శక్తులు దేశ సమగ్రతను దెబ్బతీసే కుట్రలు చేస్తున్నాయని, ఈ సందర్భంలో భగత్ సింగ్ అభిప్రాయాలకు మరింత ప్రాధాన్యత ఉందని ఆయన అన్నారు. ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తున్న శక్తులపై ఐక్యంగా పోరాడాలని, యువత, విద్యార్థులు, మేధావులు విప్లవ వీరుల స్ఫూర్తితో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. భగత్ సింగ్, రాజగురు, సుఖదేవ్‌ల 95వ వర్ధంతి సందర్భంగా దేశ ఐక్యత కోసం మతోన్మాద విధానాలపై ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరాన్ని మాదం తిరుపతి స్పష్టం చేశారు.

# నర్మెట్టలో ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవంలో రైతుల ఉత్సాహం





**మానకొండూర్ / సిద్ధిపేట /పాలకుర్తి, మార్చి 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా నర్మెట్ట గ్రామంలో 300 కోట్ల వ్యయంతో నిర్మించిన ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవం, రిఫైనరీ శంకుస్థాపన కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా నిర్వహించిన రైతు ఉత్సవాల్లో రాష్ట్రవ్యాప్తంగా రైతులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. మానకొండూర్ నియోజకవర్గంలోని ఆరు మండలాల నుంచి రైతులు, మహిళలు ఆర్టీసీ బస్సుల్లో తరలివెళ్లారు. చెంజర్ల, ఖాదర్‌గూడెం, గంగిపల్లి, అన్నారం, మానకొండూర్, వెల్ది, ఉటూర్, ఈదులగట్టెపల్లి, గట్టుదుద్దెనపల్లి గ్రామాల రైతులు పాల్గొన్నారు. అలాగే శంకరపట్నం, తిమ్మాపూర్, గన్నేరువరం, బెజ్జంకి, ఇల్లందకుంట మండలాల గ్రామాల రైతులు కూడా పెద్ద సంఖ్యలో తరలి వెళ్లారు. రైతుల తరలింపును వ్యవసాయ అధికారులు, ఎంపీడీఓలు, పంచాయతీ కార్యదర్శులు పర్యవేక్షించారు. పాలకుర్తి మండలం నుండి సుమారు 110 మంది రైతులు రెండు ఆర్టీసీ బస్సుల్లో బయలుదేరారు. వారికి ఉచిత రవాణా, అల్పాహారం, భోజన సౌకర్యాలు కల్పించారు. ముఖ్యమంత్రి ఎకరాకు 6 వేల రూపాయల రైతు భరోసా నిధులు విడుదల చేయడంపై రైతులు ఆనందం వ్యక్తం చేశారు. రైతు ఉత్సవాల సభలో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, గుజరాత్‌లో పాల ఉత్పత్తిలో వర్గీస్ కురియన్ చేసిన కృషి మాదిరిగా, తెలంగాణలో ఆయిల్ ఫామ్ సాగులో తుమ్మల నాగేశ్వరరావును 'ఆయిల్ ఫామ్ కురియన్'గా భావిస్తాం అన్నారు. ఆయిల్ ఫామ్ సాగు ప్రకృతి ఇబ్బందులు తక్కువగా ఉండే పంట అని, ఏ భూమిలోనైనా సాగు చేయవచ్చని వివరించారు. ప్రతి మండల కేంద్రంలో ఆయిల్ ఫెడ్ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. నర్మెట్టలో ఏర్పాటు చేసిన ఫ్యాక్టరీ గంటకు 30 టన్నుల నుంచి 120 టన్నుల వరకు క్రషింగ్ సామర్థ్యం కలిగి ఉందని వెల్లడించారు. రైతులు పంటల మార్పిడిలో ఆదర్శంగా నిలవాలని పిలుపునిచ్చారు. రైతుల ఖాతాల్లో రైతు భరోసా నిధులు జమ చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మంత్రి కృతజ్ఞతలు తెలిపారు.

# ఘనంగా శ్రీశ్రీ భాష్యం విజయసారథి మెమోరియల్ అవార్డు కార్యక్రమం



**కరీంనగర్ రూరల్, మార్చి 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
సర్వ వైదిక సంస్థానం వ్యవస్థాపకులు స్వర్గీయ భాష్యం విజయసారథి స్మారకార్థంగా ఏర్పాటు చేసిన మెమోరియల్ అవార్డు ప్రధానోత్సవ కార్యక్రమం కృష్ణానగర్‌లోని యజ్ఞ వరాహ స్వామి ఆలయ ఆవరణలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అవార్డు గ్రహీత ప్రభాకర్ శర్మను సన్మానించారు. మొదటగా వరాహ స్వామిని దర్శించి ప్రత్యేక పూజలు చేసిన కమలాకర్ అనంతరం భాష్యం విజయసారథి సంస్కృతంలో రచించిన సుమారు 100 పుస్తకాలను ఒకే గ్రంథరూపంలో ముద్రించి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నాకు రాజకీయ బిక్షను ప్రసాదించిన మహా ఆధ్యాత్మికవేత్త భాష్యం విజయసారథి. వారి ఆశీస్సులతో, యజ్ఞ వరాహ స్వామి చల్లని చూపుతోనే ఇప్పటివరకు నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచాను. ఎప్పటికీ వారి ఆశీర్వాదం నాతోనే ఉంటుంది అని అన్నారు. వారు బతికుండగా ఎల్లప్పుడూ యజ్ఞ వరాహక్షేత్ర అభివృద్ధి మాత్రమే కోరుకునేవారని గుర్తుచేసుకున్నారు. ఆలయానికి చేరుకునే మార్గాన్ని శ్రీ భాష్యం విజయసారథి మార్గా తన చేతుల మీదుగా నామకరణం చేయడం అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. అదేవిధంగా నగరంలోని రాజరాజేశ్వర డిగ్రీ కళాశాల వద్ద నిర్మించే కళావేదిక ముందు ఆయన విగ్రహం ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామని ప్రకటించారు. మెమోరియల్ అవార్డు అందుకున్న ప్రభాకర్ శర్మకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బారాస నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఏనుగు రవీందర్ రెడ్డి, ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

# ఎన్ఎస్ఎస్ వ్యక్తిత్వ వికాసం పెంపొందిస్తుంది - శ్రీనివాస్




**కరీంనగర్ రూరల్, మార్చి 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కరీంనగర్ జిల్లా కేంద్రానికి చెందిన వివేకానంద డిగ్రీ మరియు పీజీ కళాశాల జాతీయ సేవా పథకం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నగునూరు గ్రామంలో ఏడు రోజుల ప్రత్యేక శిబిరం మూడవ రోజు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్. శ్రీనివాస్ మాట్లాడుతూ, ఎన్ఎస్ఎస్ ద్వారా వ్యక్తిత్వ వికాసం పెంపొందించుకొని సేవాభావంతో ముందుకు సాగాలని విద్యార్థులను ప్రోత్సహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన శాతవాహన యూనివర్సిటీ తెలుగు అసిస్టెంట్ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ ఎన్ఎస్ఎస్ వాలంటీర్లకు లైఫ్ స్కిల్స్ ప్రాముఖ్యతను వివరించారు. ఎన్ఎస్ఎస్ యూనిట్--1 ప్రోగ్రాం అధికారి ధనపురి సాగర్ మాట్లాడుతూ, గ్రామాల్లో సమస్యలపై అవగాహన పెంపొందించుకొని పరిష్కార మార్గాలను అన్వేషించడం ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల ప్రధాన కర్తవ్యమని తెలిపారు. యూనిట్--2 ప్రోగ్రాం అధికారి మహేశ్ మాట్లాడుతూ, గ్రామంలో ఏడు రోజుల సేవా కార్యక్రమాలకు వాలంటీర్లు ముందుకు రావడం అభినందనీయమని అన్నారు. తరువాత వాలంటీర్లు పచ్చదనం, పరిశుభ్రత, మూఢనమ్మకాల నిర్మూలన, అక్షరాస్యత ప్రాముఖ్యతపై ర్యాలీ నిర్వహించారు. శ్రమదాన కార్యక్రమంలో భాగంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరిసరాల్లో పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రపరిచారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్. శ్రీనివాస్, డాక్టర్ గోపికృష్ణ, గ్రామ సర్పంచ్ ఎస్. శ్రావణి మహేందర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు ధనపురి సాగర్, బైరం మహేశ్, నాంపల్లి శ్రీనివాస్ మరియు వాలంటీర్లు పాల్గొన్నారు.

# వాసవి వృద్ధాశ్రమంలో అన్నప్రసాద వితరణ




**కరీంనగర్, మార్చి 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
: వాసవి క్లబ్ రీజియన్ ఛైర్‌పర్సన్ రాచమల్ల గాయత్రి -- కిరణ్ కుమార్తె రాచమల్ల వసుధ పుట్టినరోజు సందర్భంగా వాసవి వృద్ధాశ్రమంలో అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. వసుధకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆమె ఆయురారోగ్యాలతో, అష్టశ్వర్యాలతో, సుఖసంతోషాలతో విలసిల్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వాసవి వనిత ఏంజిల్స్ క్లబ్ అధ్యక్షురాలు రావికంటి భాగ్యలక్ష్మి, ప్రధాన కార్యదర్శి పల్లెర్ల విద్య, కోశాధికారి గుండా శ్రీదేవి మరియు క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

# మహిళా అభ్యర్థులకు ప్రత్యేక అవకాశం

**- మెగా జాబ్ మేళా**

**కరీంనగర్, మార్చి 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కరీంనగర్ గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ ఫర్ ఉమెన్ ఆటోనమస్లోని తెలంగాణ స్కిల్స్ అండ్ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో, మేజిక్ బస్సు ఇండియా ఫౌండేషన్ సహకారంతో మెగా జాబ్ మేళా నిర్వహించబడుతోంది. ఈ జాబ్ మేళా మార్చి 24, 2026 మంగళవారం ఉదయం 9 గంటలకు కళాశాల ఆడిటోరియంలో జరుగుతుంది. ప్రముఖ సంస్థలు క్యూస్ కార్పొరేషన్, ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్, ఆదర్శ నెక్స ఆటోమొబైల్స్ ప్రైవేట్ లిమిటెడ్, వరుణ్ మోటార్స్, ధ్రువంత్ సొల్యూషన్స్, డీ మార్ట్, సాయి లైఫ్ సైన్సెస్, హెటరో ఫార్మా, ఫ్యూషన్ ఫైనాన్స్,ర్యాండ్స్టాడ్ తదితర సంస్థలు పాల్గొని మహిళా అభ్యర్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నాయి. అదే రోజున ఎంపికైన వారికి ఆఫర్ లెటర్లు కూడా అందజేయబడతాయి. 2020 నుండి 2026 వరకు యూజీ, పీజీ అన్ని విభాగాలలో ఉత్తీర్ణులైన మహిళా అభ్యర్థులు మాత్రమే ఈ జాబ్ మేళాకు హాజరుకావడానికి అర్హులు. అభ్యర్థులు తప్పనిసరిగా తమ రెస్యూమే మరియు విద్యార్హతల సర్టిఫికేట్లు తీసుకురావాలి. మరిన్ని వివరాల కోసం సంప్రదించండి: 7893186719 ,7893082090 అర్హులైన మహిళా అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరుతున్నారు.

## శృంగేరి శారదా పీఠాధీశ్వర జయంతి ఉత్సవాల్లో పాల్గొన్న కేంద్ర మంత్రి బండి సంజయ్



**కరీంనగర్, మార్చి 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కర్ణాటకలోని శ్రీశ్రీశ్రీ శంకరాచార్య మహాసంస్థానం దక్షిణామ్నాయ శ్రీ శృంగేరి శారదా పీఠాధిపతి అనంత శ్రీ భారతీ తీర్థ మహాస్వామి వారి 76వ జయంతి ఉత్సవాల్లో కేంద్ర హోం సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా శృంగేరి శారదా పీఠం ఉత్తరాధికారి విధుశేఖర భారతి స్వామీజీ నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో జరిగిన సహస్ర నారికేళ హవనం మహా యజ్ఞం పూర్ణాహుతి కార్యక్రమంలో కూడా పాల్గొన్నారు. యజ్ఞం ప్రాసస్త్యం గురించి పీఠం పూజారులు వివరించగా, స్వామీజీ స్వహస్తాలతో బండి సంజయ్‌కు తీర్థ ప్రసాదాలు అందజేశారు. తరువాత బండి సంజయ్ శృంగేరి శారదాంబ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శృంగేరి పీఠ తెలంగాణ బాధ్యులు వ్యాసోజల రాధాకృష్ణ శర్మతో పాటు భక్తులు పాల్గొన్నారు.

## నూతన సీసీ రోడ్ల ప్రారంభించిన గ్రామ సర్పంచ్ గుళ్ళ రజిత రాజు



**హుస్నాబాద్, మార్చి 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
చిగురుమామిడి మండలం నవాబుపేట గ్రామంలోని నాలుగో వార్డులో నూతన సీసీ రోడ్ల ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గుళ్ళ రజిత రాజు, ఏఎంసీ చైర్మన్ కంది తిరుపతి రెడ్డి, ఉప సర్పంచ్ ఇనుగాల శ్రీనివాస్ రెడ్డి పాల్గొని రోడ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాభివృద్ధిలో భాగంగా మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని తెలిపారు. సీసీ రోడ్ల నిర్మాణంతో వర్షాకాలంలో కలిగే ఇబ్బందులు తగ్గి ప్రజలకు సౌకర్యవంతమైన రవాణా అందుబాటులోకి వస్తుందని అన్నారు. అదేవిధంగా గ్రామంలోని ఇతర వార్డుల్లో కూడా అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని, తాగునీరు, డ్రైనేజీ, వీధి దీపాలు వంటి సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. గ్రామ ప్రజలు కూడా అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, యువత, మహిళలు మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ఘనంగా పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ ప్రశిక్షణ అభియాన్ కార్యక్రమం



**సిరిసిల్ల, మార్చి 22(నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో మండల శాఖ అధ్యక్షుడు రేపాక రామచంద్ర రెడ్డి ఆధ్వర్యంలో పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ 24 గంటల శిక్షణ శిబిరం ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బీజేపీ అంటేనే క్రమశిక్షణ గల పార్టీ అని, కార్యకర్తలు కూడా నిబద్ధతతో, క్రమశిక్షణతో పనిచేస్తారని అన్నారు. రెండు ఎంపీ సీట్లతో ప్రారంభమైన బీజేపీ, క్రమశిక్షణతోనే దేశంలో అత్యంత ప్రజాదరణ పొందిన పార్టీగా ఎదిగిందని, బలమైన రాజకీయ శక్తిగా అవతరించిందని పేర్కొన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి పొన్నాల తిరుపతి రెడ్డి, జిల్లా కార్యదర్శి మద్దుల బుగ్గారెడ్డి, సీనియర్ నాయకులు గరిపెల్లి ప్రభాకర్, మండల ప్రధాన కార్యదర్శులు నంది నరేష్, కృష్ణ హరి, ఇతర నాయకులు, కార్యకర్తలు ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ప్రతిపక్షాలు నిర్వర్తించే బాధ్యతను భుజాన వేసుకున్న కవితక్క

**- గుంజపడుగు హరిప్రసాద్**



**కరీంనగర్, మార్చి 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఖమ్మం జిల్లా వెలుగుమట్ల బాధితులకు న్యాయం జరగడం కవితక్క పోరాట ఫలితమేనని తెలంగాణ జాగృతి జిల్లా అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి మహిళల పట్ల గౌరవం లేదని, తెలంగాణ మహిళల ఆత్మగౌరవం కోసం కవితక్క నిరంతరం పోరాడుతున్నారని పేర్కొన్నారు. నెల రోజులలోనే కవితక్క నాయకత్వంలో రాష్ట్రంలో కొత్త రాజకీయ శక్తి రూపుదిద్దుకోబోతోందని, మహిళలు, యువతకు జాగృతిలో ప్రత్యేక ప్రాధాన్యత ఉంటుందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా కరీంనగర్‌కు చెందిన మల్లాపురి రజిత సాయిలు, కారేంగుల నాగరాజు జాగృతిలో చేరారు. వారికి కండువా కప్పి స్వాగతం పలికిన హరిప్రసాద్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్యార్థులకు వాగ్దానం చేసిన ఎలక్ట్రానిక్ వాహనం, మహిళలకు తులం బంగారం, 2500 రూపాయల సహాయం వంటి అంశాలు పూర్తిగా విస్మరించబడ్డాయని విమర్శించారు. అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ కేవలం గత సంవత్సరం లెక్కలను మళ్లీ చదివినట్టే తప్ప కొత్త కేటాయింపులు లేవని, ఇది పూర్తిగా ఫేక్ బడ్జెట్ అని ఆయన అన్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్నది పేదల ప్రభుత్వం కాదు, బడా బాబులకు కొమ్ము కాసే ప్రభుత్వం అని వెలుగుమట్ల సంఘటన ద్వారా తేలిపోయిందని పేర్కొన్నారు. ప్రతిపక్షాలు నిర్వర్తించే బాధ్యతను కవితక్క భుజాన వేసుకొని, పేదల పక్షాన ప్రభుత్వం పై పోరాటం చేస్తుందని, త్వరలోనే ప్రజల గొంతుకగా కవితక్క నాయకత్వంలో నూతన రాజకీయ శక్తి వెలుగులోకి వస్తుందని హరిప్రసాద్ స్పష్టం చేశారు.

# ఘనంగా శాలివాహన జయంతి వేడుకలు



**హైదరాబాద్, మార్చి 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
శాలివాహన ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్రశాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్ టాంక్‌బండ్ వద్ద శాలివాహన జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ కుమ్మర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, తెలంగాణ ఎకనామిక్ ఫోరం అధ్యక్షుడు, రచయిత నేదునూరి కనకయ్య మాట్లాడుతూ, శాలివాహనుడు కుమ్మరుల ముద్దుబిడ్డ, భారతదేశాన్ని పాలించిన గొప్ప చారిత్రక పురుషుడు. ఆయన పేరుతోనే శాలివాహన శకం ప్రారంభమైంది. బహుజనులకు స్ఫూర్తి ప్రదాత అయిన ఈ వీరుని ఆదర్శంగా తీసుకుని కుమ్మరులు, బహుజనులు రాజ్యాధికారాన్ని చేపట్టాలి అని పిలుపునిచ్చారు. గౌరవ అతిథిగా హాజరైన రాష్ట్ర ప్రభుత్వ దాశరథి సాహిత్య అవార్డు గ్రహీత, ప్రముఖ రచయిత అన్నవరం దేవేందర్ మాట్లాడుతూ, శాలివాహనుడు కుమ్మర కులంలో జన్మించి దక్షిణ భారతదేశాన్ని పాలించడమే కాకుండా విక్రమార్కుడిని ఓడించి ఉత్తర భారతదేశాన్ని కూడా ఏలాడు. ఆయన పాలనలో భారతదేశం అంతా ఒకే ఏకత్వంలో నిలిచింది అని అన్నారు. బీసీ రచయితల సమాఖ్య రాష్ట్ర కన్వీనర్ గాజోజు నాగభూషణం మాట్లాడుతూ, శాతవాహనులు ప్రతిష్ఠానపురం, ధాన్యకటకం, కోటిలింగాలను రాజధానులుగా చేసుకుని 400 సంవత్సరాలకు పైగా 32 మంది రాజులు పాలించారు అని వివరించారు. డిగ్రీ కాలేజీ తెలుగు లెక్చరర్ బుర్ర వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, గౌతమిపుత్ర శాతకర్ణి, పులోమావి, యజ్ఞశ్రీ శాతకర్ణి వంటి రాజులు స్త్రీల అభివృద్ధికి, సంక్షేమానికి అత్యంత గౌరవం ఇచ్చారు. శాలివాహనుడు లక్షలాది పద్యాలు రచించిన రాజకవి అని అన్నారు. కుమ్మర సంఘాల నాయకులు మాట్లాడుతూ, కుమ్మరులు ఐక్యంగా బలంపుంజుకుని శాలివాహనుడిని ఆదర్శంగా తీసుకొని ఆత్మగౌరవంతో హక్కుల రక్షణకు ముందుకు సాగాలి అని పిలుపునిచ్చారు. పలువురు వక్తలు శాలివాహన జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బిక్షపతి లక్ష్మీనారాయణ, జి.పి.రావు, శ్యాంకుమార్, శ్రీనివాస్, రూపేష్, పూర్ణచందర్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు. శాలివాహన విగ్రహానికి పూలమాల వేసి జయంతి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

# మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది


**- మంత్రి జి. వివేక్ వెంకటస్వామి**



**మంచిర్యాల, మార్చి 22(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
క్యాతనపల్లి--మందమర్రి మున్సిపాలిటీల్లో అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని రాష్ట్ర కార్మిక మరియు గనుల శాఖ మంత్రి జి. వివేక్ వెంకటస్వామి తెలిపారు. క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 8, 9వ వార్డుల్లో రూ.13 లక్షల టీఐఎఫ్ఐడీసీ నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్లకు, అమ్మ గార్డెన్ వద్ద జాతీయ రహదారిపై రూ.1.80 కోట్లతో ఏర్పాటు చేస్తున్న సెంట్రల్ లైటింగ్ పనులకు, అమరావతిలో రూ.1.50 కోట్లతో చేపడుతున్న సీసీ రోడ్ల పనులకు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్‌తో కలిసి మంత్రి ప్రారంభం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీల మేరకు సీసీ రోడ్ల నిర్మాణం చేపడుతున్నామని, మందమర్రి--క్యాతనపల్లి మున్సిపాలిటీల్లో రూ.200 కోట్ల వ్యయంతో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు పూర్తి చేశామని తెలిపారు. ప్రజలకు అత్యవసరమైన మౌలిక సదుపాయాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, గతంలో ప్రజలు ఎదుర్కొన్న ఇబ్బందులను తొలగించేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. గత ప్రభుత్వంలో అభివృద్ధి శూన్యమని, ఆ సమయంలో నాయకులు కమిషన్ల కోసం మాత్రమే పనులు చేసి ప్రజల సమస్యలను పట్టించుకోలేదని విమర్శించారు. పట్టణ అభివృద్ధికి మరో ముఖ్యమైన అడుగుగా రూ.2.31 కోట్ల వ్యయంతో చేపట్టనున్న మినీ ట్యాంక్ బండ్ సుందరీకరణ పనులకు మంత్రి వివేక్ వెంకటస్వామి భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పట్టణాల్లో పర్యావరణ సౌందర్యాన్ని పెంపొందించడమే కాకుండా ప్రజలకు విశ్రాంతి, వినోదం కలిగించే ప్రదేశాలను అభివృద్ధి చేయడం ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. మినీ ట్యాంక్ బండ్ అభివృద్ధితో స్థానిక ప్రజలకు ఉదయం, సాయంత్రం వేళల్లో సేదతీరే సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఇలాంటి అభివృద్ధి కార్యక్రమాలను మరింత విస్తరించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# గుడుంబా స్థావరాలపై ఎక్సైజ్ పోలీసుల దాడులు

**వెల్దండ, మార్చి 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
వెల్దండ మండల కేంద్రంలోని చెదురుపల్లి గ్రామంలో గుడుంబా స్థావరాలపై ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించారు. కల్వకుర్తి సీఐ వెంకటరెడ్డి ఆదేశాల మేరకు జరిగిన ఈ దాడుల్లో 200 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసి, ఇద్దరిపై కేసులు నమోదు చేసినట్లు ఎక్సైజ్ ఎస్ఐ వివేక్ తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐలు వివేక్, శృతి, కానిస్టేబుళ్లు మహేష్, నర్స, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.







# కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం కాదు- పార్టీ కార్యకర్తల ప్రభుత్వం

**మంథని, మార్చి 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

మల్హార్ మండలం కొయ్యూరులో స్వర్గీయ పుట్ట లింగమ్మ స్మారకార్థం పుట్ట మధన్న ఫ్రెండ్లీ యూత్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పుట్ట మధన్న ప్రీమియర్ లీగ్ సీజన్--1 ప్రారంభోత్సవ కార్యక్రమంలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ, ప్రజా ప్రభుత్వమంటూ గొప్పలు చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం వాస్తవానికి పార్టీ కార్యకర్తల కోసమే నడుస్తోందని తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. రాజకీయాలకు అతీతంగా క్రీడాభిమానుల కోసం నిర్వహించే టోర్నమెంట్‌ను రాజకీయరంగంలోకి లాగడం సరైంది కాదని ఆయన అన్నారు. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వం ప్రజల కోసం పనిచేయాలి కానీ ప్రతిపక్షానికి అనుకూలంగా ఉన్నవారిని ఇబ్బందులకు గురిచేయడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు.మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ, యువత క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలని, ఆరోగ్యంగా ఉండేందుకు వ్యాయామం, క్రీడలు తప్పనిసరి అని సూచించారు. మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్



మాట్లాడుతూ, మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్ నమ్మినోళ్లను మోసం చేస్తున్నారని, ఆయన గెలుపులో కీలక పాత్ర పోషించిన మహేష్‌రెడ్డిని పక్కన పెట్టడం అన్యాయం అని విమర్శించారు.బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు రాకేష్‌రెడ్డి మాట్లాడుతూ, పుట్ట మధన్న ఆత్మవిశ్వాసం, పోరాట పటిమ అందరికీ ఆదర్శమని, యువతలో క్రీడాస్ఫూర్తి పెంపొందించడంలో ఆయన పాత్ర గొప్పదని అన్నారు. మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ జక్కు శ్రీహర్షిణీ రాకేష్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులు క్రీడాస్ఫూర్తిని పెంపొందించుకోవాలని, మహిళా క్రికెట్‌కు కోచింగ్ సదుపాయాలు కల్పించేందుకు తనవంతు సహకారం అందిస్తానని తెలిపారు. ఈ టోర్నమెంట్‌లో పాల్గొన్న నాయకులు, ప్రజాప్రతినిధులు, క్రీడాభిమానులు క్రీడాస్ఫూర్తిని ప్రోత్సహిస్తూ, యువతలో పోరాట పటిమను పెంపొందించాలన్న సంకల్పాన్ని వ్యక్తం చేశారు.

# విద్యుత్ బస్సుల విధానం ప్రజలపై, కార్మికులపై పెనుభారం

**కరీంనగర్, మార్చి 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

విద్యుత్ బస్సుల విధానం ప్రజలపై, కార్మికులపై పడే భారంపై సిఐటియు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం ముకుందలాల్ మిశ్రా భవన్‌లో జరిగింది. ఈ సమావేశానికి సిఐటియు జిల్లా అధ్యక్షుడు యు. శ్రీనివాస్ అధ్యక్షత వహించగా, ఉపాధ్యక్షుడు ఎడ్ల రమేష్, సహాయ కార్యదర్శి పున్నం రవి, కోశాధికారి జి. రాజేశం, వివిధ యూనియన్ల నాయకులు పాల్గొన్నారు.సిఐటియు జిల్లా కార్యదర్శి గీట్ల ముకుంద రెడ్డి మాట్లాడుతూ, 2019లో ఎం.వి. యాక్ట్ సవరణతో పాటు విద్యుత్ బస్సుల విధానాన్ని కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాల హక్కులను గుంజుకునేలా అమలు చేసిందని విమర్శించారు. విద్యుత్ బస్సుల పథకాలు అన్నీ గ్రాస్ కాస్ట్ కాంట్రాక్ట్ (జిసిసి) పద్ధతిలోనే ఉండి, బస్సుల కొనుగోలు, నిర్వహణ, ఆపరేషన్ అన్నీ ప్రైవేటు కార్పొరేట్ కంపెనీల చేతుల్లోనే ఉన్నాయని తెలిపారు. ఆర్టీసీలకు ఎటువంటి పాత్ర లేకుండా, కేవలం రూట్ నిర్ణయించే బాధ్యత మాత్రమే మిగిలిందని, బస్సులు నడిచినా, నడవకపోయినా ప్రతి నెలా కంపెనీలకు చెల్లింపులు చేయాల్సి వస్తుందని అన్నారు.ఇప్పటి వరకు విద్యుత్ బస్సుల పథకాల కోసం కేంద్ర ప్రభుత్వం 1,11,651 కోట్లు ఖర్చు చేసినా, ఒక్క రూపాయి కూడా ఆర్టీసీలకు ఇవ్వలేదని ఆయన పేర్కొన్నారు. ప్రైవేట్ ఆపరేటర్లకు రెవెన్యూ రిస్క్ లేకుండా లాభాల గ్యారెంటీ కల్పించడానికే ఈ



విధానం తెచ్చారని, ప్రజా రవాణా సంస్థలను పూర్తిగా ప్రైవేటు పెట్టుబడిదారుల చేతుల్లోకి అప్పగించడం సిఐటియు తీవ్రంగా వ్యతిరేకిస్తుందని స్పష్టం చేశారు.కరీంనగర్--2 డిపో నుండి నడుస్తున్న విద్యుత్ బస్సులకు జిసిసి పద్ధతిలో కిలోమీటరుకు రూ.39.80 చెల్లింపులు జరుగుతున్నాయని, ప్రతి సంవత్సరం 2% పెంపు కూడా ఒప్పందంలో ఉందని తెలిపారు. మొత్తం ఖర్చు కిలోమీటరుకు రూ.54.80గా ఉండగా, ప్రయాణికులు 100 కి.మీ. లోపు రూ.10, ఆపై రూ.20 చెల్లించాల్సి వస్తుందని, విద్యుత్ బస్సులు పెరిగే కొద్దీ ఈ భారం ప్రజలపై మరింత పెరుగుతుందని హెచ్చరించారు. ఆర్టీసీలో 2019లో 49,700 మంది కార్మికులు ఉండగా, 2025 డిసెంబర్ నాటికి 38,535 మందికి తగ్గిపోయారని, 11,165 మంది ఉద్యోగాలు కోల్పోయారని తెలిపారు. అదనంగా 10,000 మంది కాంట్రాక్ట్ కార్మికులు పనిచేస్తున్నారని, 2017 పే స్కేలు అరియర్స్ చెల్లించకపోవడంతో పాటు 2021, 2025 పే స్కేల్స్ ప్రకటించలేదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ విద్యుత్ బస్సుల విధానంలో మార్పులు చేసి, ఆర్టీసీలకు అవకాశం కల్పించాలని, జిసిసి పద్ధతిని రద్దు చేసి, ప్రైవేటు సంస్థలకు ఇస్తున్న సబ్సిడీలను ఆర్టీసీలకు ఇవ్వాలని, ఆర్టీసీలు నేరుగా విద్యుత్ బస్సులను సమకూర్చుకునేలా అవకాశం కల్పించాలని గీట్ల ముకుంద రెడ్డి డిమాండ్ చేశారు.

# రాష్ట్ర బడ్జెట్‌పై బీఆర్ఎస్ నేతల విమర్శలు

**పెద్దపల్లి, మార్చి 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

రాష్ట్ర బడ్జెట్‌పై మాజీ ఎమ్మెల్యేలు దాసరి మనోహర్ రెడ్డి, కోరుకంటి చందర్, పుట్ట మధుకర్‌తో కలిసి మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రెస్ మీట్ నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిన బడ్జెట్ అని, తెలంగాణను తిరోగమనంలోకి నెట్టే బడ్జెట్ అని తీవ్రంగా విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం పథకాలకు గండికొట్టి, స్కామ్‌లకు ప్రోత్సాహం ఇస్తోందని ఆరోపించారు.వారు పేర్కొన్న వివరాల ప్రకారం, రూ.3,24,234 కోట్లతో ప్రవేశపెట్టిన తాజా బడ్జెట్‌లో అంకెల గారడీ తప్ప ఏమీ లేదని, రాష్ట్ర ఆదాయం పడిపోయిందని తెలిపారు. కేసీఆర్ హయాంలో తెలంగాణ దేశంలో టాప్ రాష్ట్రంగా నిలిచిందని, కానీ కాంగ్రెస్ పాలనలో తిరోగమనంలోకి వెళ్ళిందని అన్నారు.ఆరు గ్యారెంటీలకు తగిన నిధులు కేటాయించలేదని, మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఇచ్చిన



హామీలు, యువతకు స్కూటీల పథకం, గృహజ్యోతి పథకం వంటి వాటికి తగిన నిధులు కేటాయించలేదని విమర్శించారు. రైతు భరోసా, ధాన్య బోనస్, గురుకుల పాఠశాలల అభివృద్ధి వంటి అంశాల్లో కూడా ప్రభుత్వం విఫలమైందని పేర్కొన్నారు.దళితులకు ఇచ్చిన అంబేద్కర్ అభయహస్తం పథకం హామీని పూర్తిగా విస్మరించారని, ఇందిరమ్మ బీమా పథకం అమలుపై కూడా స్పష్టత లేదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అంటే కష్టాలు, కన్నీళ్లు, కూల్చివేతలు, పేల్చివేతలే అని తీవ్రంగా విమర్శించారు. ఈ ప్రెస్ మీట్‌లో బీఆర్ఎస్ పార్టీ పెద్దపల్లి పట్టణ అధ్యక్షుడు ఉప్పు రాజ్ కుమార్, గోపు ఐలయ్య యాదవ్, నడిపెల్లి మురళీధర్ రావు, నారదాసు మారుతీ, పూదరి చంద్రశేఖర్, కేధం కిషోర్, అఫ్జల్ బాబా, ప్రేమ్ కుమార్, గాజుల అరుణ్, నేరటి శ్రీనివాస్, బొడ్డుపల్లి శ్రీనివాస్, మేడి సదానందం, దాసరి బాలరాజు, కుమార్ నాయక్, మేకల కొమురయ్య, కుమార్ యాదవ్, బోన్ల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ కార్యకర్తల సమక్షంలో కేసీఆర్ హరీష్‌రావుకు పాలాభిషేకం



**హుస్నాబాద్, మార్చి 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

హుస్నాబాద్ అంబేద్కర్ చౌరస్తాలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి హరీష్‌రావుకు పాలాభిషేకం నిర్వహించారు.సిద్దిపేట జిల్లా నంగునూర్ మండలం నర్మేట గ్రామంలో దేశంలోనే అతిపెద్ద ఆయిల్ పామ్ ఫ్యాక్టరీని తీసుకురావడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం, ముఖ్యంగా కేసీఆర్, హరీష్‌రావు కృషి చేసిన ఘనతను గుర్తుచేసుకుంటూ ఈ కార్యక్రమం జరిగింది. రూ.300 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ రైతులకు ఆర్థికంగా బలాన్ని చేకూర్చిందని, హరీష్‌రావు పట్టుదలతో గ్రామాల వారీగా రైతులను ఒప్పించి 12 వేల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు ప్రారంభించారని నాయకులు పేర్కొన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం గత బీఆర్ఎస్ హయాంలో జరిగిన అభివృద్ధిని గుర్తించలేకపోతోందని, రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. రైతుల కోసం కేసీఆర్, హరీష్‌రావు చేసిన మేలును ప్రజలు ఎప్పటికీ మరిచిపోరని, కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నెరవేర్చే వరకు బీఆర్ఎస్ పార్టీ పోరాటం కొనసాగిస్తుందని నాయకులు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రతినిధులు సూద్దాల చంద్రయ్య, అయిలేని మల్లికార్జున రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఎమ్.ఎ. అన్వర్ పాషా, మున్సిపల్ కౌన్సిలర్లు గాదపాక రవీందర్, గడిపే సంపత్, సీనియర్ నాయకులు బీలు నాయక్, సూరంపల్లి పరశురాములు, కన్నోజు రామకృష్ణ, కొంకట రవీందర్, ఇంద్రాల సారయ్య, యాస శ్రీనివాస్, కాశపోబోయిన శీను, మేకల వికాస్ యాదవ్, సిదిరాల శ్రీనివాస్, జీవన్ నర్సింహా రెడ్డి, గోపాగోని అరవింద్ గౌడ్, బూర వెంకన్న గౌడ్, కనుకయ్య, గూగులోతు తిరుపతి నాయక్, పూదరి రవీందర్ గౌడ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## షాద్‌నగర్‌లో "హ్యాపీ సండే" సందడి


- యోగా, కరాటే, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకర్షణ



**షాద్‌నగర్, మార్చి 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

షాద్‌నగర్ పురపాలక సంఘం ఆధ్వర్యంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న 99 రోజుల ప్రత్యేక కార్యక్రమంలో "హ్యాపీ సండే" వేడుకలు ఆదివారం మినీ స్టేడియంలో ఘనంగా జరిగాయి.ఈ కార్యక్రమానికి పురపాలక సంఘం చైర్మన్ అగ్గునూరు బసవేశ్వర్ అధ్యక్షత వహించారు. యోగా, కరాటే ప్రదర్శనలు ప్రేక్షకులను ఆకట్టుకోగా, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. నృత్యకారుల ప్రదర్శనలు, మిమిక్రీ కళాకారుడి వినోదం ప్రజలను అలరించాయి.ఈ సందర్భంగా పురపాలక సంఘం కమిషనర్ మాట్లాడుతూ, "ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడం, సామాజిక ఐక్యతను బలోపేతం చేయడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం" అని తెలిపారు. మున్సిపల్ చైర్మన్ అగ్గునూరు బసవేశ్వర్ మాట్లాడుతూ, "ఇలాంటి కార్యక్రమాలు ప్రజలలో సానుకూల మార్పులు తీసుకురావడంలో కీలక పాత్ర పోషిస్తాయి" అని పేర్కొన్నారు.ఈ వేడుకలో వైస్ చైర్మన్ అందే మోహన్, కౌన్సిలర్లు, యోగా గురువులు, కరాటే బృందం, నృత్య కళాకారులు, మిమిక్రీ కళాకారుడు, అధికారులు, పట్టణ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడిగా అన్న ఇల్లూరు లక్ష్మయ్య ఏకగ్రీవ ఎన్నిక పట్ల నీల రవీందర్ హర్షం





**షాద్‌నగర్, మార్చి 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడిగా అన్న ఇల్లూరు లక్ష్మయ్య ఏకగ్రీవంగా ఎన్నికవ్వడం పట్ల రంగారెడ్డి జిల్లా ఆర్యవైశ్య యువజన సంఘం కోశాధికారి, ప్రముఖ సామాజిక కార్యకర్త నీల రవీందర్ హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "నిరాడంబర మూర్తి, సేవా తత్పరులు అయిన శ్రీ ఇల్లూరు లక్ష్మయ్య ఈ అత్యున్నత పదవిని చేపట్టడం మన వైశ్య జాతికి గర్వకారణం. ఆర్యవైశ్య సమాజ అభ్యున్నతి కోసం, కులబాంధవుల ఐక్యత కోసం ఆయన చేస్తున్న కృషి అనన్యం. వారి అనుభవజ్ఞుడైన నాయకత్వంలో ఆర్యవైశ్య మహాసభ సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో మరింత బలోపేతం అవుతుందని ఆశిస్తున్నాను" అని పేర్కొన్నారు.

# భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్‌ల 95వ వర్ధంతి సభలు విస్తృతంగా నిర్వహించాలని పి.డి.ఎస్.యు పిలుపు




**కరీంనగర్, మార్చి 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో గోదావరిఖని డివిజన్ కేంద్రంలో వాల్ పోస్టర్స్ ఆవిష్కరణ జరిగింది. భారత జాతీయోద్యమ వీరులు షాహీద్ భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్‌ల 95వ వర్ధంతి స్మారక వారోత్సవాలను మార్చి 23 నుండి 30 వరకు అన్ని విద్యాసంస్థల్లో విస్తృతంగా నిర్వహించాలని పి.డి.ఎస్.యు జిల్లా అధ్యక్షుడు అంగిడి కుమార్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ఉరికొయ్యలను ముద్దాడి ప్రాణత్యాగం చేసిన వీరుల స్ఫూర్తితో నేటి విద్యార్థి, యువత విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం ఉద్యమించాలన్నారు. దేశంలో పెరుగుతున్న కుల, మతోన్మాద ఫాసిజం, కార్పొరేట్ దోపిడీపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ, మోడీ ప్రభుత్వం అమెరికా చేతిలో కీలుబొమ్మగా మారిందని విమర్శించారు. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ యుద్ధోన్మాద చర్యలను విడనాడాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి 15% నిధులు కేటాయిస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేదని, 2026--27 బడ్జెట్‌లో కేవలం 8.23% నిధులు మాత్రమే కేటాయించిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం, మైనారిటీ విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న స్కాలర్షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయకుండా పేద విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని విమర్శించారు. విద్య ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా, అందరికీ సమానమైన, నాణ్యమైన విద్య కోసం, కుల--మత అసమానతలు లేని సమానత్వ సమాజ స్థాపన కోసం, లౌకిక ప్రజాస్వామిక హక్కుల కోసం భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్‌ల పోరాట స్ఫూర్తితో ఉద్యమించాలని పిలుపునిచ్చారు. అనంతరం పి.డి.ఎస్.యు ఎస్సీ హాస్టల్ కమిటీని ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా ఆర్. మనోహర్, ప్రధాన కార్యదర్శిగా ఎం. రాము, ఉపాధ్యక్షులుగా డి. సంతోష్, సహాయ కార్యదర్శిగా ఏ. ఈశ్వర్, కోశాధికారిగా ఈ. విష్ణు, సభ్యులుగా బన్నీ, శివ తదితరులు ఎన్నికయ్యారు.

## నాటి విద్యార్థులు నేడు సమాజానికి స్ఫూర్తినిస్తున్నారు





**వనపర్తి టౌన్ మార్చి 22(నీలగిరి ఎక్స్ ప్రెస్ ):** వనపర్తి స్థానిక రాణి లక్ష్మీదేవి అమ్మ డిగ్రీ కాలేజ్ 1980-83 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఎస్ఎల్వి గార్డెన్‌లో ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆనాటి అధ్యాపకులు బిఎల్ఎన్ మూర్తి మాట్లాడుతూ నాటి మా విద్యార్థులు నేడు సమాజంలో స్ఫూర్తినియ్యడం సంతోషకరమని అన్నారు. అధ్యాపకులు సిద్ధిరామిరెడ్డి, శివరామకృష్ణ, అనంతరెడ్డి, దశరథ రాములు, కృష్ణయ్య తదితరులు హాజరై పూర్వ విద్యార్థులతో ఆత్మీయంగా ముచ్చటించారు. ఈ సందర్భంగా అధ్యాపకులు మాట్లాడుతూ, నాడు తాము విద్యార్థులకు పాఠాలు బోధించగా, నేడు వారు సమాజంలో ఉన్నత స్థానాల్లో నిలిచి తమకు స్ఫూర్తిగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. గురు-శిష్య సంబంధం కాలానుగుణంగా మరింత బలపడిందని తెలిపారు. నాటి కాలంలో ఉన్న సరళ జీవన విధానం, పరస్పర గౌరవం, విలువలు నేటి ఆధునిక జీవన శైలి మధ్య ఉన్న తేడాలను వివరిస్తూ ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. పూర్వ విద్యార్థులు తమ కాలేజ్ రోజుల జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ సమ్మేళనం పాత స్నేహాలను మరింత బలపరిచే వేదికగా నిలిచింది. కార్యక్రమం ఆనందభరిత వాతావరణంలో సాగింది.

## అంబేద్కర్ సంఘం నూతన అధ్యక్షుడిగా బూర్గుల నవీన్‌కుమార్



**మహేశ్వరం, మార్చి 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండల కేంద్రంలోని పెద్దపులి నాగారం గ్రామానికి చెందిన బూర్గుల నవీన్‌కుమార్‌ను అంబేద్కర్ సంఘం అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "అంబేద్కర్ సంఘం అధ్యక్ష పదవిని నాకు అప్పగించిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు. సమాజ అభ్యున్నతి కోసం, సంఘ బలోపేతం కోసం కృషి చేస్తాను" అని తెలిపారు. ఉపాధ్యక్షుడిగా దార సిద్దు, కార్యదర్శిగా చెవిటి హరేందర్ ఎన్నికయ్యారు. అనంతరం బూర్గుల నవీన్‌కుమార్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. హనుమాన్ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహానికి పూలమాల వేసి గౌరవం తెలిపారు.

## వనపర్తి జెడ్పీహెచ్ఎస్ పూర్వ విద్యార్థుల స్వర్ణోత్సవ వేడుకలు ఘనంగా




**వనపర్తి,మార్చి 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్ ):** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలుర), వనపర్తి 1975--76 విద్యాసంవత్సరానికి చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం స్థానిక ఎంవైఎస్ బ్యాంకెట్ హాల్‌లో స్వర్ణోత్సవ వేడుకలు నిర్వహించారు. దాదాపు 50 సంవత్సరాల అనంతరం సుమారు 60 మంది పూర్వ విద్యార్థులు ఒకేచోట కలుసుకొని జ్ఞాపకాలను పంచుకున్నారు. ఈ సమ్మేళనానికి మాజీ ఉపాధ్యాయులు సోమసుందరం, విజయకుమార్ హాజరై విద్యార్థులతో అనుభవాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు ఇద్దరు ఉపాధ్యాయులను సన్మానించారు. అలాగే స్వర్ణోత్సవ సంవత్సరం సందర్భంగా ప్రతి విద్యార్థికి మెమెంటో, గ్రూప్ ఫోటోలను అందజేశారు. ఈ కార్యక్రమాన్ని కాగితాల మనోహర్, కలకొండ ప్రకాష్, సుదర్శన్ రెడ్డి, బండారు కుమారస్వామి, భగవంజి, వెంకటస్వామి, ఎల్లస్వామి తదితరులు నిర్వహించారు.

# పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే





-మహిళా శక్తి మిషన్. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలన్న సంకల్పం.
-"మహిళల ఆర్థిక సాధికారతకు మహిళా సమాఖ్య సంఘాలు కీలకం".
-ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్.

**దేవరకొండ మార్చి 22. (నీలగిరి ఎక్స్ ప్రెస్).** నల్లగొండ జిల్లా,డిండి మండలంలోని సోమ్లా తండా, కామేపల్లి గ్రామాలలో ఎన్ ఆర్ ఈజిఎస్ నిధుల నుండి మంజూరైన 10. 00లక్షల రూపాయల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న మహిళా సమాఖ్య సంఘ భవన నిర్మాణ పనులకు ప్రజా ప్రతినిధులతో కలిసి శంకుస్థాపన చేసిన దేవరకొండ శాసన సభ్యులునేనావత్ బాలు నాయక్. మండలంలోని ఎర్రారం, టీ. గౌరారం, ఖానాపూర్, పెద్ద తండా, చెరుకు పల్లి గ్రామాలలో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు. మండలంలోని టీ. గౌరారం, ఖానాపూర్ గ్రామాలలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇండ్ల గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొని, ఇంటి యజమానులకు శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. టీ. గౌరారం గ్రామంలో హై స్కూల్ ప్రహరీ గోడ,ఆహార ధాన్య నిల్వ గోదాం నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఉపాధి హామీ పథకం ఎన్ఆర్ఈజీఎస్ కింద మంజూరైన 10 లక్షల రూపాయలనిధులతో గ్రామ సమాఖ్య భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, మహిళా సంఘాల బలోపేతానికి ఈవి ఓభవనం ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు. నిర్ణీత కాలపరిమితిలోగా నాణ్యతతో ఈ భవన నిర్మాణాలను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామాల అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. దశలవారీగా గ్రామంలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిన నాటి నుంచి అనేక సంక్షేమ పథకాలతో పాటు పేదలకు సొంత ఇంటి కల నెరవేర్చాలనే లక్ష్యంతో ప్రజా ప్రభుత్వం పనిచేస్తుందని, ఇందిరమ్మ రాజ్యంలో ప్రతి పేద కుటుంబానికి సొంత ఇంటి కల నెరవేరుతుందని పేర్కొన్నారు. విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్ పథకం. 2026-27 విద్యా సంవత్సరం నుంచి ప్రీ-ప్రైమరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు విద్యార్థులకు నాణ్యమైన పోషకాలతో రాష్ట్రంలో నూతనంగా బ్రేక్ ఫాస్ట్ పథకాన్ని ప్రారంభించనుంది. బ్రేక్‌ఫాస్ట్‌లో ప్రతి విద్యార్థికి వారానికి 3 రోజులు పాలు, మిగతా మూడు రోజులు రాగిజావ అందించడం. ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం. ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో ఇంటర్మీడియట్ విద్యార్థులకు కూడా ఇకపై కొత్తగా మధ్యాహ్న భోజన పథకాన్ని విస్తరించడం. విద్యార్థుల సంక్షేమం కోసం తీసుకుంటున్న చర్యల్లో ఇదొక సరికొత్త అధ్యాయానికి నాంది.

"ఈ బడ్జెట్ తెలంగాణ ప్రజల ఆశా దీపం. అభివృద్ధికి, సంక్షేమానికి పెద్దపీట వేసి ఆర్భాటాలకు పోకుండా ఆర్థిక క్రమశిక్షణకు ప్రాధాన్యతనిస్తున్నాం" తెలంగాణ ప్రజల ఆశలు, ఆశయాలను నిజం చేసే సంకల్పపత్రమే ఈ బడ్జెట్. పేదవాడి కన్నీరు తుచిన నాడే నిజమైన అభివృద్ధి అన్న మహాత్మాగాంధీ మాటలు, ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ఒక సుందరమైన,సుసంపన్నమైన, ప్రశాంతమైన తెలంగాణ రాష్ట్రాన్ని నిర్మించే బ్లూ ప్రింట్ ఈ బడ్జెట్. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దొంతినేని వేంకటేశ్వర రావు,రేఖ్యనాయక్,పేర్ల లింగయ్య , మండల విద్యాధికారి పగిడిపాటినరసింహా, ప్రజా ప్రతినిధులు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, మండల ముఖ్య నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, సర్పంచులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# 10 ఏళ్ల తర్వాత మళ్లీ కలిసిన కందుకూరు బాయ్స్ హై స్కూల్ 2009-10 బ్యాచ్



**కందుకూరు, మార్చి 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం కందుకూరు మండలంలోని బాయ్స్ హై స్కూల్ 2009-10 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు 10 ఏళ్ల తర్వాత మళ్లీ కలుసుకుని ఆత్మీయంగా గెట్ టుగెదర్ నిర్వహించారు. 2017లో దెబ్బడగూడ బురుజుకోట మైసమ్మ ఆలయం వద్ద మొదటి సమావేశం జరగగా, ఈసారి అదే స్నేహ బంధంతో మరోసారి కలుసుకున్నారు. ఈ సందర్భంగా స్నేహితులు ఒక్కరికొకరు శుభాకాంక్షలు తెలుపుకుంటూ, తమ జీవిత ప్రయాణంలో ఎదురైన అనుభవాలను పంచుకున్నారు. స్కూల్ రోజుల సరదా సంఘటనలు, గురువుల జ్ఞాపకాలు గుర్తు చేసుకుంటూ అందరూ భావోద్వేగానికి లోనయ్యారు. ఇలాంటి సమావేశాలు స్నేహాన్ని మరింత బలపరుస్తాయని, భవిష్యత్తులో కూడా తరచూ కలుసుకోవాలని నిర్ణయించారు. పరస్పరం సహకారం అందించుకుంటూ, అవసర సమయంలో ఒకరికొకరు తోడుగా ఉండాలని సంకల్పించారు. ఈ గెట్ టుగెదర్‌లో పి. సురేష్, ఎం. శివకుమార్, కె. రాజశేఖర్, కె. రామకృష్ణ, పి. మహేష్ గౌడ్, ఎం. మహేష్, ఎం. వినోద్, ఎ. సురేష్, కె. గణేష్, జి. శివ, బి. శ్రీను, డి. శివ, ఎ. రమేష్, కె. సురేష్, ఎన్. బాలకృష్ణ, ఎన్. గిరీష్, ఎన్. శ్రీకాంత్, జి. నవీన్, కుమార్, వి. భాస్కర్, పి. శాంసన్, ఎం. శేఖర్ రెడ్డి, సుజన్, ఎ. రాజు, శ్రీశైలం, డి. దుర్గప్రసాద్, టి. నరేందర్, జి. మల్లేష్, బి. నిరంజన్, కె. శ్రీకాంత్, డి. రామకృష్ణ, కె. అరవింద్, డి. గణేష్, బి. రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

# సీసీ రోడ్డు పనులు ప్రారంభించిన సర్పంచ్ కేశమల్ల అనూష కృష్ణ



**వెల్దండ, మార్చి 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
వెల్దండ మండల పరిధిలోని పెద్దాపూర్ గ్రామంలో ఆదివారం కొత్త సీసీ రోడ్డు పనులు ప్రారంభమయ్యాయి. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో, గ్రామ సర్పంచ్ కేశమల్ల అనూష కృష్ణ కొబ్బరికాయ కొట్టి పనులకు శ్రీకారం చుట్టారు.స్వామి వివేకానంద విగ్రహం నుంచి భయ్యా బంగారు ఇంటి వరకు 3 లక్షల 50 వేల రూపాయల వ్యయంతో ఈ రోడ్డు నిర్మాణం జరుగనుంది. ఈ కార్యక్రమంలో కాటిక అంజయ్య, పల్సం శ్రీధర్ గౌడ్, జక్కుల మల్లేష్ యాదవ్, గ్రామ వార్డు సభ్యులు పాల్గొన్నారు.గ్రామ ఉపసర్పంచ్ ప్రసాద్ చారి, వార్డు సభ్యులు గంగాపురం రమేష్, నిరంజన్, మమత, అనిల్ కుమార్, తిరుపతి నాయక్, తక్కెళ్ళపల్లి లలిత మల్లయ్య, రజినీ, జానీ నాయక్, గ్రామ ప్రజలు తదితరులు హాజరయ్యారు.



# అ'పూర్వం.. ఆత్మీయం

**ఆమనగల్లు, మార్చి 22(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
వారంతా బాల్యమిత్రులు.. పదో తరగతి పూర్తయ్యాక ఎక్కడెక్కడో స్థిరపడిన వారంతా రెండు దశాబ్దాల తర్వాత మళ్లీ చదువులమ్మ ఒడిలో కలుసుకున్నారు. ఆత్మీయ పలకరింపులు, ఆలింగనాల నడుమ నాటి మధుర స్మృతులను గుర్తు చేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. కడ్తాల్ మండలంలోని ఎక్వాయిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2002 - 03 బ్యాచ్ కు చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం మైసిగండి కేంద్రంలోని ఎంబీ గార్డెన్స్ లో నిర్వహించారు. 23 ఏళ్ల తర్వాత చిన్న నాటి మిత్రులంతా ఒకే వేదికపై కలవడంతో పండగ వాతావరణం నెలకొంది. అనంతరం నాటి ఉపాధ్యాయులు గోవర్ధన్ రెడ్డి, విద్యధర్, ప్రకాష్, గీతా రాణి, బుచ్చిరెడ్డి, అనంత స్వామి శాలువాలతో సత్కరించారు. ఇందులో పూర్వపు విద్యార్థులు సుంకరి మహేష్, సదానందం, రఘుపతి, జంగయ్య, గోవర్ధన్, బిక్షపతి, కేశవులు, రాములు, చంద్రకాంత్, మల్లేష్, శేఖర్, వెంకటేష్, మల్లేష్, గంటి నర్సింహా, విజయలక్ష్మి, యాదమ్మ, లావణ్య, మల్లేష్, స్వాతి, బౌరమ్మ, రాధిక తదితరులు ఉన్నారు.

# నిరుపేద ఇంటి నిర్మాణానికి ఉప్పల ట్రస్ట్ చేయూత



**ఆమనగల్లు, మార్చి 22 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని 10వ వార్డు విటాయిపల్లి నిరుపేద కుటుంబానికి చెందిన ఊరటి మల్లయ్య ఇంటి నిర్మాణానికి మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్ చేయూతనందించారు. ఆదివారం ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ తరపున మల్లయ్య ఇంటి నిర్మాణానికి సిమెంట్, సామగ్రిని అందజేశారు. అదేవిధంగా మంచుకొండ జగదీష్ 30 సిమెంట్ బస్తాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని పేద ప్రజలను అన్ని విధాల ఆదుకోవడమే ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ధ్యేయమని తెలిపారు. పేదల ఇండ్ల నిర్మాణంతోపాటు, విద్యార్థుల ఉన్నత చదువులకు ట్రస్ట్ తరుపున సహరిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో శంకర్ నాయక్, సాలయ్య, బన్నే శేఖర్, చంద్రు నాయక్, వెంకట్ రెడ్డి, జంగాచారి, కాసోజు ప్రశాంత్, నారామోని మల్లేష్, నారామోని వీరేష్, సతీష్, పర్వతాలు తదితరులు పాల్గొన్నారు.

# పూలే--అంబేడ్కర్ జయంతుల సందర్భంగా కుల రహిత సమానత్వ సాంస్కృతిక ఉత్సవాలు జయప్రదం చేయండి

**పాలడుగు నాగార్జున, జిల్లా ప్రధాన కార్యదర్శి**



**నల్లగొండ మార్చి 22 (నీలగిరి ఎక్స్ ప్రెస్);**
మహాత్మ జ్యోతిబా పూలే, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతుల సందర్భంగా కులరహిత సమానత్వ సాంస్కృతిక ఉత్సవాలను విజయవంతం చేయాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు నాగార్జున పిలుపునిచ్చారు. ఈనెల 28 న నల్లగొండలో ఆహ్వాన సంఘాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా మిర్యాలగూడ పట్టణంలోని కందుకూరి కన్వెన్షన్ హాల్లో ఏర్పాటు చేసిన పత్రికా విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మహనీయుల ఆశయాలను కొనసాగించడానికి భావితరాలకు సామాజిక వివక్ష, అన్యాయాలు, దళితుల సంక్షేమం మరియు అభివృద్ధి అంశాలపై సమగ్ర చర్చలు జరగాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.నేటికీ కుల వివక్ష తీవ్రమైన రూపం దాలుస్తోందని, కులం--మతం పేరుతో సమాజంలో విభజనలు సృష్టించే కుట్రలు కొనసాగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దళితులపై దాడులు, కులదురహంకార హత్యలు, కులాంతర వివాహాలపై దాడులు పెరుగుతున్నాయని అన్నారు. సమాన అవకాశాలు దళితులకు అందకుండా అడ్డంకులు సృష్టించే పరిస్థితులు బహిరంగంగా కనిపిస్తున్నాయని తెలిపారు.ఈ నేపథ్యంలో పూలే--అంబేడ్కర్ జనజాతర ద్వారా కులరహిత సమానత్వం కోసం సామాజిక సాంస్కృతిక ఉత్సవాలు నిర్వహిస్తున్నామని, ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాలు సామాజిక సంఘాలు ప్రజా సంఘాలు ప్రజలు, ప్రజాతంత్ర వాదులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు .ఈ పత్రికా సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీను, రాష్ట్ర కమిటీ సభ్యులు రెమిడాల పరిసరాములు, జిల్లా సహాయ కార్యదర్శి దైద శ్రీను, ఉపాధ్యక్షులు కోడిరెక్క మల్లయ్య, జిల్లా కమిటీ సభ్యులు దోరేపల్లి మల్లయ్య, యేసు, నల్ల రామస్వామి బొంగరల వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

# 1800 కిలోల నల్లబెల్లం, 70కిలోలపట్టిక పట్టివేత

**-సుమారు 10 లక్షల విలువగల సొమ్ము స్వాధీనం.**






**దేవరకొండ మార్చి 22. నీలగిరి ఎక్స్ ప్రెస్)**
నల్లగొండ ఎన్ ఫోర్స్ మెంట్ అసిస్టెంట్ కమిషనర్ బి.సంతోష్ ఆదేశాల మేరకు మరియు ఏ ఈ ఎస్ ఎస్ ఎన్ ఫోర్స్ మెంట్ ఎ.కిషన్ పర్యవేక్షణలో ఆదివారం తెల్లవారుజామున ఎక్సైజ్ పోలీస్ వారు దేవరకొండ మండలం పడమటిపల్లి క్రాస్ రోడ్ సమీపంలో రూట్ వాచ్ నిర్వహించి దాడులు చేశారు.ఈ దాడిలో అక్రమంగా నల్ల బెల్లాన్ని రవాణా చేస్తున్న ముగ్గురు వ్యక్తుల పైన రెండు కేసులను వేరువేరుగా నమోదు చేశారు.కొండమల్లేపల్లి మండలం, బాపూజీ నగర్ గ్రామ నివాసి సంపంగి రాములు తండ్రి కిష్టయ్య అనే వ్యక్తి 900 కిలోల నల్లబెల్లం(30 సంచుల్లో) 50కిలోల పట్టిక,మహీంద్రా బొలెరో మాక్స్ టిజి.05టి.9996వాహనంలో తరిలిస్తున్నారు, ఒకమొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. కొండమల్లేపల్లి, మేగ్య తండాకు చెందిన ఆంగోత్ తరుణ్ తండ్రి బిచ్య, దేవరకొండ మండలం పాత్లావత్ తండా, పాత్లావత్ లాలు తండ్రి రెడ్యా, వీరు ఏపి.10.ఏజే.1159, మరియు మారుతి ఆల్టో ఏపి.28బిబి.4312ల గల వాహనాలలో మొత్తం 30సంచులలో ప్రతి సంచిలో (30కిలోలు) 900 కిలోల నల్లబెల్లం మరియు 20 కిలోల పట్టిక,10లీటర్ల ఐడిఎల్ స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. ముగ్గురుని అరెస్టు చేశారు. వాహనాలతో సహా నిషేధిత స్వాధీనం చేసుకున్న నిషేధిత వస్తువుల విలువ మొత్తం సుమారు 10 లక్షలు.ఈ దాడుల్లో పాల్గొన్న అధికారులు ఎస్.శ్రీనివాస్ , ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ దేవరకొండ, శేఖర్ రెడ్డి, నాగరాజు, అనిల్, నల్గొండ ఏసి ఎన్ఫోర్స్మెంట్ కి చెందిన ప్రొహిబిషన్ ఎక్సైజ్ కానిస్టేబుల్స్ పాల్గొన్నారు.కేసు పత్రాలు స్వాధీనం చేసుకున్న దానిని దేవరకొండ ఎస్. హెచ్.ఓ కు అప్పగించారు.

# కళ్యాణ లక్ష్మి -- షాది ముబారక్ చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే.

**-ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం**
**రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి రూ. 5 లక్షల జీవిత బీమా.**
**-ఎమ్మెల్యేనేనావత్ బాలు నాయక్.**





**దేవరకొండ మార్చి 22. (నీలగిరి ఎక్స్ ప్రెస్).**
దేవరకొండ పట్టణంలోని ఎమ్మెల్యే నివాసం వ్యవసాయ మార్కెట్ యార్డ్ లో ముఖ్యమంత్రి సహాయనిధి నుండి మంజూరైన 251 మందికి గాను 92,61000/- రూపాయల విలువ గల చెక్కులను స్వయంగా లబ్ధిదారులకు పంపిణీ చేసిన దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్.
రాష్ట్ర ప్రభుత్వం నుండి మంజూరైన కళ్యాణ లక్ష్మి - షాది ముబారక్ చెక్కులను లబ్దిదారులకు పంపిణీ చేయడం జరిగింది.కొండమల్లేపల్లి మండలం మొత్తం -11 చెక్కులు గాను 1101276/- రూపాయలు.చింతపల్లి మండలం మొత్తం - 25చెక్కులకు గాను 2502900/- రూపాయలు.
చందంపేట మండలం మొత్తం 43 చెక్కులకు గాను 4304988/- రూపాయలు.
డిండి మండలం మొత్తం - 20 చెక్కులకు గాను 2002320 /- రూపాయలు.
మొత్తం 99 చెక్కులకు గాను 9911484/- రూపాయల విలువ గల చెక్కులను అబ్దిదారులకు పంపిణి చేశారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ ,ప్రజా ప్రభుత్వం రెండు సంవత్సరాలలో ముఖ్య మంత్రి సహాయనిధి కింద మంజూరు అయిన 3526 చెక్కులను గాను దాదాపు 16కోట్ల రూపాయలు లబ్ధిదారులకు పంపిణి చేయడం జరిగింది.అలాగే 293మందికి ఎల్ ఓసి ద్వారా దాదాపు 9కోట్ల రూపాయలతో మెరుగైన వైద్యం అందించాం.
ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో పేద మరియు మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించడంలో సీఎం సహాయనిధి ముఖ్య పాత్ర పోషిస్తోందన్నారు. పేద కుటుంబాల ఆడపిల్లల వివాహాలకు ఆర్థికంగా సహాయం చేయడం కోసం ప్రభుత్వం కళ్యాణ లక్ష్మి మరియు షాది ముబారక్ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.
జూన్ 2వ తేదీ 2026 నుంచి రాష్ట్రంలో సామాజిక అంతరాలతో సంబంధం లేకుండా పేద, మధ్య తరగతి, ధనిక అని తేడా లేకుండా రాష్ట్రంలోని 1 కోటి 15 లక్షల కుటుంబాలకు ప్రతి కుటుంబానికి 5 లక్షల రూపాయల జీవిత బీమా అందించే ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం.ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, ముఖ్య నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, సర్పంచులు, కౌన్సిలర్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే రాములుకు ఘన నివాళులు



**ఇబ్రహీంపట్నం, మార్చి 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఇబ్రహీంపట్నం నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, సీపీఎం సీనియర్ నేత కొండిగారి రాములు (90) మార్చి 13న అనారోగ్యంతో కన్నుమూశారు. 1989, 1994లో సీపీఎం తరఫున రెండుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికై ప్రజాసేవలో విశిష్ట స్థానాన్ని సంపాదించారు.ఆదివారం ఆయన దశదినకర్మ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా రాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఇబ్రహీంపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గుర్నాథ్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ మహిపాల్, అసెంబ్లీ ఓబీసీ చైర్మన్ సుబ్బురు పాండు, కాంగ్రెస్ నాయకుడు సంపత్ రెడ్డి తదితరులు అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## అగ్నిప్రమాదంలో నష్టపోయిన విశ్వబ్రహ్మణ కుటుంబానికి సహాయం చేయాలని విజ్ఞప్తి



**ఎలిగేడు, మార్చి 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఓదెల మండలం పొత్కపల్లికి చెందిన విశ్వబ్రహ్మణుడు పుప్పాల రమేశ్ కార్పెంటర్ షాపు ఇటీవల అగ్నిప్రమాదంలో పూర్తిగా కాలిపోయింది. టేకు కర్రతోపాటు పది రకాల మిషన్లు దగ్ధమవడంతో రూ.15 లక్షలకు పైగా నష్టం జరిగినట్లు విశ్వబ్రహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు కట్ట రాజానందం తెలిపారు.ఈ నేపథ్యంలో బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం తరఫున ఆదుకోవాలని ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావును ఆదివారం ఎలిగేడు మండలం శివపల్లిలోని ఆయన నివాసంలో వినతి పత్రం అందజేశారు.అనంతరం రాజానందం మాట్లాడుతూ, "కులవృత్తిని చేసుకొని జీవనోపాధి పొందుతున్న రమేశ్ కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకోవాలని సంబంధిత అధికారులతో మాట్లాడి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలి" అని కోరారు.తరువాత ప్రభుత్వ విప్ విజయరమణారావును శాలువాతో సన్మానించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో బాధితుడు పుప్పాల రమేశ్, ప్రధాన కార్యదర్శి నాగవల్లి శ్రీమన్నారాయణ, ముఖ్య సలహాదారు కందుకూరి ప్రకాశరావు, కార్యదర్శి అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

## వనభోజనాలతో ఆత్మీయ అనుబంధం

**- మంచాల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వేడుకలు**






**ఇబ్రహీంపట్నం, మార్చి 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మంచాల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వనభోజనాలు, ఆత్మీయ సమ్మేళనాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాసవికన్యకాపరమేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.సామూహిక భోజనాలు, ఆటపాటలతో ఆధ్యాత్మికతతో పాటు సామాజిక అనుబంధాలను బలపరుస్తాయని సంఘం అధ్యక్షుడు ప్రవీణ్ గుప్త పేర్కొన్నారు.ఈ వేడుకలో ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ రంగారెడ్డి జిల్లా కోశాధికారి వనపర్తి బద్రినాథ్ గుప్త పాల్గొని మాట్లాడుతూ, "వనభోజనాలు ఐక్యత, స్నేహభావాన్ని పెంపొందిస్తాయి. ఒకే చోట చేరి సామూహిక భోజనాలు చేయడం అభినందనీయమైన సంప్రదాయం" అని అన్నారు.ఈ కార్యక్రమంలో సంఘం మండల కార్యదర్శి నరేష్, మాజీ అధ్యక్షుడు కండె మల్లేష్ గుప్త, సంఘ పెద్దలు ఎల్‌బి శాస్త్రి, రాజేష్‌తో పాటు మహిళలు, యువకులు, చిన్నారులు పాల్గొన్నారు.

## విమానం దిగుతూ తడబడిన ట్రంప్..!



**అమెరికా మార్చి 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆరోగ్యంపై మరోసారిచర్చ ప్రారంభమైంది. ఎయిర్ ఫోర్స్ వన్ లో ఆయన ఫ్లోరిడాకు చేరుకున్నారు. ఈ క్రమంలో రెయిలింగ్ పట్టుకొని విమానం దిగుతూ కన్పించారు. మధ్యలో ఆగుతూ, తడబడుతూ, జాగ్రత్తగా నడుస్తున్న వీడియోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. కాగా.. దీనికి ముందు రోజు ఓ కార్యక్రమానికి సంబంధించిన వీడియో కూడా తాజాగా వైరల్ అవుతుంది. అందులో ట్రంప్ కుర్చీలో కూర్చునేందుకు ఇబ్బంది పడినట్లుగా కన్పిస్తోంది. ఈ వీడియోలపై కొందరు నెగెటివ్ కామెంట్లు పెడుతుండగా, మరికొందరు ఇది సాధారణమైన విషయమేనని అంటున్నారు.


## ఖతార్‌లో సైనిక హెలికాప్టర్ కూలి ఆరుగురు మృతి



**దోహా : మార్చి 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఖతార్లో జరిగిన దుర్ఘటనలో సైనిక హెలికాప్టర్ సముద్రంలో కూలిపోవడంతో ఆరుగురు మృతి చెందినట్లు అధికారులు తెలిపారు. ఈ ఘటన ఆదివారం సాధారణ విధి నిర్వహణలో భాగంగా చోటుచేసుకుంది. రక్షణ, అంతర్గత వ్యవహారాల మంత్రిత్వ శాఖల ప్రకారం, మృతులలో ఒకరి కోసం ఇంకా గాలింపు కొనసాగుతోంది. మృతుల వివరాలను అధికారికంగా వెల్లడించలేదు. సాంకేతిక లోపం కారణంగానే ఈ ప్రమాదం జరిగిందని ఖతార్ రక్షణ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. హెలికాప్టర్‌లో ఒక పైలట్‌తో పాటు పలువురు ప్రయాణికులు ఉన్నట్లు సమాచారం. దేశ సముద్ర సరిహద్దు ప్రాంతంలో కూలిపోయిన ఈ హెలికాప్టర్ కోసం విస్తృత గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. అంతర్గత వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక దళాలను వేర్వేరు బృందాలుగా విభజించి గాలింపులు చేపట్టారు. ప్రమాద ప్రాంతంలో సంబంధిత విభాగాలు సమన్వయంతో సహాయక చర్యలను కొనసాగిస్తున్నాయని అధికారులు వెల్లడించారు.

## కుక్కల దాడిలో 15 జింకలు మృతి.

**నలుగురు అటవీ శాఖ సిబ్బంది సస్పెండ్**



**రాయ్‌పూర్:మార్చి 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
వీధి కుక్కల దాడిలో 15 జింకలు మరణించాయి. దీంతో అటవీ శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. నలుగురు సిబ్బందిని సస్పెండ్ చేశారు. ఈ సంఘటనపై దర్యాప్తునకు ఆదేశించారు. ఛత్తీస్‌గఢ్‌లోని సుర్గుజా జిల్లాలో ఈ సంఘటన జరిగింది. అంబికాపూర్‌లోని సంజయ్ వన్ వాటికను అటవీ శాఖ నిర్వహిస్తున్నది. చిన్న జూ మాదిరిగా ఉండే ఈ వనంలో పలు రకాల జింకలు ఉన్నాయి. వీటిని చూసేందుకు సందర్శకులు వస్తుంటారు. కాగా, శనివారం తెల్లవారుజామున జింకల ఎన్‌క్లోజర్‌లోకి ఐదారు వీధి కుక్కలు చొరబడ్డాయి. అక్కడి జింకలపై దాడి చేశాయి. దీంతో మచ్చల జింక, మొరిగే జింక, నాలుగు కొమ్ముల దుప్పిలతో సహా పద్నాలుగు జింకలు శనివారం మరణించాయి. కుక్కలు కరవడంతో తీవ్రంగా గాయపడిన ఒక జింక ఆదివారం చనిపోయింది. మరోవైపు కుక్కల దాడి వల్ల 15 జింకలు చనిపోయినట్లు సుర్గుజా డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్ (డీఎఫ్‌వో) అభిషేక్ జోగావత్ తెలిపారు. నిబంధనల ప్రకారం వాటికి అంత్యక్రియలు నిర్వహించినట్లు చెప్పారు. విధుల్లో నిర్లక్ష్యం వహించిన ఒక డిప్యూటీ రేంజర్, ముగ్గురు ఫారెస్ట్ గార్డులతో సహా నలుగురిని సస్పెండ్ చేసినట్లు వెల్లడించారు. అంబికాపూర్ సబ్ డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్ నేతృత్వంలో ఒక విచారణ బృందాన్ని ఏర్పాటు చేసినట్లు అభిషేక్ జోగావత్ తెలిపారు. దోషులుగా తేలిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు.


## ఆలయాన్ని ధ్వంసం చేసిన వారిపై కఠిన చర్యలు తప్పనిసరి

**-- బిజెపి రాష్ట్ర నాయకుడు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి**



**కేశంపేట్, మార్చి 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కేశంపేట్ మండలం వేములనర్వ గ్రామంలోని శ్రీ వేణుగోపాల స్వామి దేవాలయంలో అక్రమ తవ్వకాలు జరగడం దుర్మార్గమైన చర్య అని బిజెపి రాష్ట్ర నాయకుడు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి తీవ్రంగా ఖండించారు.గ్రామ సర్పంచ్ భర్త చిన్న నర్సిములు, ఆలయ పూజారి వేణయ్య పంతులు కొంతమంది వ్యక్తులతో కలిసి గుప్తనిధుల కోసం తవ్వకాలు చేపట్టారని గ్రామ యువకులు విష్ణువర్ధన్ రెడ్డిని కలిసి వివరించారు.ఈ సందర్భంగా ఆయన ఆలయ ఈఓతో, కేశంపేట్ పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్‌తో ఫోన్‌లో మాట్లాడి, "రాజకీయానికి తావు లేకుండా దుండగులను కఠినంగా శిక్షించాలి. పవిత్రమైన ఆలయంలో ఇలాంటి అక్రమ తవ్వకాలు జరిపి భక్తుల మనోభావాలను దెబ్బతీయరాదు" అని స్పష్టం చేశారు.

## దశదినకర్మలో పాల్గొన్న భువనగిరి పార్లమెంట్ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ క్యామ మల్లేష్



**ఇబ్రహీంపట్నం, మార్చి 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
శేరిగూడ గ్రామ మాజీ సర్పంచ్ ఎదుల్ల కృష్ణారెడ్డి దశదినకర్మ కార్యక్రమంలో భువనగిరి పార్లమెంట్ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ క్యామ మల్లేష్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన కృష్ణారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారి ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షిస్తూ, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## గ్రీన్‌లాండ్‌ను కాపాడుతాం

**ద్వీప దేశానికి ఇరాన్ భరోసా**

**టెహ్రాయిన్ మార్చి 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**




: అమెరికాతో యుద్ధం వేళ డెన్మార్క్‌లోని గ్రీన్‌లాండ్ ద్వీపంపై ఇరాన్ సంచలన ప్రకటన చేసింది. అమెరికా ప్రెసిడెంట్ డొనాల్డ్ ట్రంప్ నుంచి గ్రీన్‌లాండ్‌ను రక్షించేందుకు తాము సిద్ధమని ఇరాన్ భరోసా ఇచ్చింది. ఒకవేళ యూరోపియన్ యూనియన్ (ఇయు) పిలిస్తే, వెంటనే గ్రీన్‌లాండ్‌ను రక్షించడానికి వెళ్తామని తెలిపింది. 'గ్రీన్‌లాండ్ ద్వీపాన్ని అమెరికాకు ఇచ్చేయాలని తొలుత ఇయును ట్రంప్ బెదిరించారు. అనంతరం అదే ఇయుతో ట్రంప్ ప్రాధేయపడ్డారు. ఇరాన్‌పై యుద్ధంలో అమెరికాకు ఇయు సైనిక సాయం చేయకుంటే, గ్రీన్‌లాండ్‌ను లాక్కుంటామని ఇప్పుడు మళ్లీ ట్రంప్ బెదిరిస్తున్నారు. ఒకవేళ గ్రీన్‌లాండ్‌ను కాపాడుకోలేని పరిస్థితిలో ఇయు ఉంటే, ఇరాన్‌ను పిలవండి. గ్రీన్‌లాండ్‌ను కాపాడేందుకు మాదేశం వస్తుంది' అని ఇరాన్ సైన్యం అధికార ప్రతినిధి వెల్లడించారు డియాగో గార్షియాపై దాడితో సంబంధం లేదు : ఇరాన్
హిందూ మహాసముద్రంలోని డియాగో గార్షియా ద్వీపంలో ఉన్న బ్రిటన్ సైనిక స్థావరంపై జరిగిన మిస్సైల్ దాడిలో తమ పాత్ర లేదని ఇరాన్ స్పష్టం చేసింది. ఇరాన్‌కు చెందిన ఓ సీనియర్ అధికారి ఈ విషయాన్ని చెప్పారంటూ అల్ జజీరా ఆదివారం రోజు ఒక కథనాన్ని ప్రసారం చేసింది. ఇరాన్‌కు దాదాపు 4 వేల కిలోమీటర్ల దూరంలో డియాగో గార్షియా ద్వీపం ఉంది. అంత దూరంలోని లక్ష్యాలను ఛేదించగలిగే మిస్సైళ్లు తమ దగ్గర లేవని ఇరాన్ మొదటినుంచీ చెబుతోంది. 2 వేల కిలోమీటర్లకు మించిన రేంజ్ కలిగిన క్షిపణులు తమ దగ్గర లేవని గత నెలలో ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చి తెలిపారు.



లవ్ టుడే' బ్యూటీ స్టన్నింగ్ ఫొటో షూట్..



# అలాంటి ట్రోల్స్ వల్ల చాలా ఏడ్చా:

అందాల భామ శ్రీలీల ప్రస్తుతం వరుస సినిమాలతో దూసుకుపోతుంది. తెలుగులో తక్కువ సమయంలోనే ఈ అమ్మడు మంచి క్రేజ్ సొంతం చేసుకుంది. కన్నడ ఇండస్ట్రీ నుంచి వచ్చిన శ్రీలీల తెలుగులో ఎంతో మంది అభిమానులను సొంతం చేసుకుంది. పెళ్ళిసందడి సినిమాతో హీరోయిన్ గా టాలీవుడ్ కు ఎంట్రీ ఇచ్చింది శ్రీలీల.. ఈ సినిమా పర్లేదు అనిపించుకుంది. ఆతర్వాత రవితేజ హీరోగా నటించిన ధమాకా సినిమాతో మంచి విజయాన్ని అందుకుంది. ధమాకా సినిమా బ్లాక్ బస్టర్ అవ్వడంతో శ్రీలీల కు వరుస ఆఫర్స్ క్యూ కట్టాయి. చేతి నిండా సినిమాలతో ఫుల్ బిజీగా మారిపోయింది. ఏడాదికి రెండు, మూడు సినిమాలు చేసింది. యంగ్ హీరోల దగ్గర నుంచి స్టార్ హీరోల వరకూ అందరితో కలిసి నటించింది. కానీ హిట్స్ మాత్రం శ్రీలీలకు దక్కలేదనే చెప్పాలి.తెలుగులో ఈ అమ్మడు ఇప్పటివరకు పది సినిమాల్లో నటించింది. వాటిలో హిట్ అయినవి రెండే రెండు సినిమాలు అందులో ఒకటి ధమాకా అయితే మరొకటి భగవంత్ కేసరి సినిమా.. అయితే భగవంత్ కేసరి సినిమా బాలయ్య ఖాతాలోకి వెళ్ళిపోయింది. రీసెంట్ గా ఉస్తాద్ భగత్ సింగ్ సినిమాలో నటించింది. మార్చ్ 19న విడుదలైన ఈ సినిమా మంచి టాక్ తెచ్చుకుంది. ఇదిలా ఉంటే హిట్స్ కంటే ఫ్లాపులే ఎక్కువ ఉన్న శ్రీలీల పై గతంలో చాలా ట్రోల్స్ వచ్చాయి. ఫ్లాపుల కారణంగా శ్రీలీల ట్రోల్స్ బారిన పడింది.తాజాగా ఓ ఇంటర్వ్యూలో తన పై వచ్చిన ట్రోల్స్ పై స్పందించింది శ్రీలీల. కెరీర్ బిగినింగ్ లో నేటిజివ్ ట్రోల్స్ విషయంలో చాలా భయపడ్డాను. కొన్నిసార్లు చాలా బాధగా అనిపించేది.. ఏడ్చేసిన సందర్భాలు కూడా ఉన్నాయి. అప్పుడు మా అమ్మతో ఇదంతా నావల్ల అవుతుందా.? కాలేజీకి తిరిగెళ్లిపోనా.? అని అడిగాను. ఎందుకంటే నేను చాలా సెన్సిటివ్. కానీ, ఇప్పుడు వాటిని ధైర్యంగా ఎదుర్కొంటున్నా అని చెప్పుకొచ్చింది శ్రీలీల. ఈ కామెంట్స్ ఇప్పుడు వైరల్ గా మారాయి.



# 'పెద్ది' ఐటెం సాంగ్‌లో మృణాల్ ఠాకూర్..

## రామ్ చరణ్‌తో స్పెషల్ డ్యాన్స్‌కు సిద్ధమా?

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ నటిస్తున్న ప్రతిష్టాత్మక చిత్రం 'పెద్ది'పై రోజురోజుకు అంచనాలు పెరుగుతున్నాయి. ఏప్రిల్ 30న విడుదలకు సిద్ధమవుతున్న ఈ సినిమాకు సంబంధించిన పోస్ట్ ప్రొడక్షన్ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో మిగిలి ఉన్న కీలక అంశాల్లో ఒకటైన ఐటెం సాంగ్ ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. దర్శకుడు బుచ్చిబాబు సన స్పెషల్ సాంగ్ కోసం సరైన హీరోయిన్ ఎంపికపై కొంతకాలంగా తీవ్రంగా కసరత్తు చేస్తున్నారు. మొదట ఈ పాటలో ముగ్గురు లేదా నలుగురు హీరోయిన్లను తీసుకోవాలనే ఆలోచన ఉన్నప్పటికీ, సమయం తక్కువగా ఉండటంతో ఆ ప్లాన్‌ను విరమించుకున్నట్లు సమాచారం. తాజాగా ఈ స్పెషల్ సాంగ్‌లో రామ్ చరణ్ సరసన నటించేందుకు మృణాల్ ఠాకూర్‌ని ఎంపిక చేసినట్లు టాలీవుడ్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. వాస్తవానికి ఈ వార్త కొద్దిరోజుల క్రితమే వినిపించినా, అధికారికంగా ఎలాంటి క్లారిటీ లేదు. అయితే ఇటీవల మృణాల్ ఠాకూర్ సోషల్ మీడియాలో షేర్ చేసిన ఫోటోలు, ఆమె హైదరాబాద్‌లో ఉన్నట్లు తెలియజేసే పోస్టులు ఈ వార్తలకు మరింత బలం చేకూరుస్తున్నాయి. ఆమె 'పెద్ది' పాట షూట్ కోసమే నగరానికి వచ్చినట్లు ఇండస్ట్రీలో టాక్ వినిపిస్తోంది. ఇక మృణాల్ ప్రస్తుతం అడివి శేష్‌తో కలిసి నటిస్తున్న 'డెకాయిట్' సినిమా ప్రమోషన్లతో కూడా బిజీగా ఉన్నారు. ఏప్రిల్ 10న విడుదల కానున్న ఈ చిత్రం కోసం ఆమె డేట్లను టీమ్ ప్రత్యేకంగా ప్లాన్ చేసింది. ఈ ప్రమోషన్ల మధ్యలో లభించే గ్యాప్‌లోనే 'పెద్ది' ఐటెం సాంగ్ షూట్ పూర్తి చేయాలని యూనిట్ భావిస్తోంది మరో ఆసక్తికర విషయం ఏమిటంటే, ఈ పాటలో మృణాల్ ఠాకూర్‌తో పాటు జాన్వీ కపూర్ కూడా కనిపించే అవకాశమున్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. మార్చి 27న రామ్ చరణ్ పుట్టినరోజు సందర్భంగా దర్శకుడు బుచ్చిబాబు ఈ సినిమా నుంచి టీజర్ లేదా ట్రైలర్ రూపంలో స్పెషల్ అప్డేట్ ఇవ్వొచ్చని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.ఇదిలా ఉండగా, 'పెద్ది' సినిమా వాయిదా పడుతుందనే ప్రచారాలకు చిత్రబృందం ఇప్పటికే చెక్ పెట్టింది. ఓవర్సీస్‌లో అడ్వాన్స్ బుకింగ్స్ ప్రారంభం కానుండగా, బిజినెస్ వ్యవహారాలు కూడా క్రమంగా పూర్తి అవుతున్నాయి. ఎట్టి పరిస్థితుల్లోనూ విడుదల తేదీ మిస్ కాకూడదనే పట్టుదలతో యూనిట్ పగలు రాత్రి శ్రమిస్తోంది. రెహమాన్ అందుబాటులోకి రాగానే సెకండాఫ్ రీ-రికార్డింగ్ పనులు వేగవంతం కానున్నాయి. మొత్తం మీద అన్ని పనులు ప్లాన్ ప్రకారం సాగుతున్న నేపథ్యంలో 'పెద్ది' విడుదల వాయిదా పడే అవకాశాలు లేవనే సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.




# రైతులే 'వంద దేవుళ్లు'

హీరో విజయ్ ఆంటోని, దర్శకుడు శశి కలయికలో వచ్చిన 'బిచ్చగాడు' చిత్రం సంచలన విజయం సాధించిన విషయం తెలిసిందే. తాజాగా వీరిద్దరి కాంబినేషన్‌లో 'వంద దేవుళ్లు' పేరుతో ఓ చిత్రం తెరకెక్కుతున్నది. శనివారం ఈ సినిమా ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను హీరో మంచు విష్ణు సోషల్‌మీడియా ద్వారా ఆవిష్కరించారు రైతు సమస్యలు చుట్టూ ఈ కథ నడుస్తుందని, విజయ్ ఆంటోని రా అండ్ రస్టిక్ పాత్రలో కనిపిస్తారని, బలమైన సామాజిక సందేశం మేళవించిన చిత్రమిదని మేకర్స్ తెలిపారు. స్వాసిక, అజయ్, కావ్య, శక్తి, పదిని, కర్నాస్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: బాలాజీ శ్రీరామ్, నిర్మాత: రామంజనేయులు జవ్వాజి, సమర్పణ: ఫాతిమా విజయ్ ఆంటోని, దర్శకత్వం: శశి.

# టికెట్ ధరలు తగ్గించిన 'ఉస్తాద్ భగత్ సింగ్' టీమ్..

## -ఫ్యామిలీ ఆడియెన్స్‌ను ఆకర్షించే స్ట్రాటజీ!




పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా, శ్రీలీల, రాశీ ఖన్నా హీరోయిన్లుగా దర్శకుడు హరీష్ శంకర్ తెరకెక్కించిన మాస్ ఎంటర్టైనర్ 'ఉస్తాద్ భగత్ సింగ్'. ఈ మూవీ ఉగాది కానుకగా ప్రేక్షకుల ముందుకు వచ్చిన సంగతి తెలిసిందే. విడుదలైన మొదటి రోజునుంచే ఈ సినిమా మంచి స్పందనను అందుకుంటూ, ముఖ్యంగా వీకెండ్‌లో రెండు తెలుగు రాష్ట్రాల్లో సాలిడ్ కలెక్షన్లను రాబడుతోంది. సినిమాలో మాస్ ఎలిమెంట్స్, పవన్ కళ్యాణ్ స్టైల్ యాక్షన్, ఎంటర్టైనింగ్ సన్నివేశాలు ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. అయితే ఆంధ్రప్రదేశ్‌లో ఈ సినిమాకు టికెట్ ధరలు పెంచిన విషయం తెలిసిందే. ఈ ధరల పెంపు సాధారణ ప్రేక్షకులపై, ముఖ్యంగా ఫ్యామిలీ ఆడియెన్స్‌పై ప్రభావం చూపిందనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి.టికెట్ రేట్లు ఎక్కువగా ఉండటంతో కొంతమంది ప్రేక్షకులు థియేటర్లకు రావడానికి వెనుకంజ వేస్తున్నారని సినీ వర్గాల్లో చర్చ జరిగింది. ఈ నేపథ్యంలో చిత్రబృందం కీలక నిర్ణయం తీసుకుంది. సోమవారం నుంచి ఆంధ్రప్రదేశ్‌లో సాధారణ టికెట్ ధరలతోనే సినిమా ప్రదర్శించనున్నట్లు ప్రకటించింది. ఈ నిర్ణయం ద్వారా మరింత మంది ప్రేక్షకులను థియేటర్లకు రప్పించి, ముఖ్యంగా ఫ్యామిలీ ఆడియెన్స్‌ను ఆకర్షించాలని మేకర్స్ భావిస్తున్నారు. టికెట్ ధరలు తగ్గించడం వల్ల సినిమాకు లాంగ్ రన్‌లో మరింత కలెక్షన్లు వచ్చే అవకాశం ఉందని ట్రేడ్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ఇక ఈ చిత్రానికి రాక్ స్టార్ దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందించగా, ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్ సంస్థ నిర్మించింది. థమన్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందించారు. సినిమాకి తొలి రోజే మిక్స్‌డ్ టాక్ లభించింది. అయితే టికెట్ ధరలు తగ్గించే ఈ నిర్ణయం 'ఉస్తాద్ భగత్ సింగ్'కు ఎంతవరకు ప్లస్ అవుతుందో రాబోయే రోజుల్లో స్పష్టమవనుంది.